Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 | సంచిక : 254 | బుధవారం | సెప్టెంబర్ 2, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 254 | Wednesday | 2 SEPTEMBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

**ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలి**

- అధికార బలం, పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడితే గట్టిగా ఎదుర్కోవాలి
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన వైయస్ జగన్



**ప్రజాభూమి ప్రతినిధి, పులివెందుల :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పులివెందుల పర్యటనలో భాగంగా భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వైయస్ జగన్‌ను కలిశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ఓపికగా విన్న ఆయన, పార్టీ నాయకులతో కూడా మాట్లాడారు. స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ

- మిగతా 2లో..



# గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారులి

- ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది
- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు
- నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం
- నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాభూమి ప్రతినిధి,నర్సాపురం :**

పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు.

పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ. 73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట :**

డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు

2 పేజీలో..



# బంగారం కొనొద్దు..

**స్వదేశీ వస్తువులే వాడండి..**

- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- భారత్ జీడీపీలో 7.8 శాతం వృద్ధి
- స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న మోదీ
- విదేశీ ప్రయాణాలు తగ్గించాలని సూచన
- విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ వద్దని పిలుపు
- అవసరం లేకపోతే బంగారం కొనొద్దని సూచన

**ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ :**

దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కిర్గిజిస్థాన్ నుంచి మంగళవారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడుదల చేసిన వీడియోలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం పెరిగిందని సోమవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి.

- మిగతా 2లో..

# ఏపీలో ఆ విద్యార్థులకు గుడ్ న్యూస్..

- మూడు రోజుల్లో 'తల్లికి వందనం' నిధులు
- మూడు రోజుల్లో 'తల్లికి వందనం' పథకం నిధుల విడుదల
- ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆర్థిక సాయం
- సాంకేతిక కారణాలతో ఆలస్యమైనట్లు వెల్లడి
- గతంలో అందని అర్హులకు కూడా ఈసారి జమ
- సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు

2 లో



# 2.82 కోట్ల మందికి ఎన్‌సీడీ పరీక్షలు పూర్తి

**ఇప్పటివరకు మొత్తం 59.29 లక్షల అధిక రక్తపోటు, 48.15 లక్షల మధుమేహం కేసుల గుర్తింపు**

- ఇందులో కొత్తగా 11.79 లక్షల బీపీ, 10.72 లక్షల మధుమేహం కేసులను తాజా సర్వే ద్వారా గుర్తింపు
- మిగిలిన కేసులు ఇంతకుముందు జరిగిన సర్వేల ద్వారా గుర్తింపు
- గిరిజనుల జీవన శైలి కారణంగా అల్లూరి జిల్లాలో అత్యల్ప బీపీ, మధుమేహం కేసులు నమోదు
- సర్వే పురోగతిని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించిన అధికారులు
- మిగిలినవారు కూడా పరీక్షలు చేయించుకోవాలని మంత్రి విజ్ఞప్తి

వివరాలు 2లో..



# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

**మరో రూ.100 కోట్లు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

- గ్రామీణ రహదారులు, తాగు నీటి సదుపాయాల కల్పనకు నిధులు
- రూ.90 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో ఏడు నియోజకవర్గాల్లో రహదారుల అభివృద్ధి
- తాగు నీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మరో రూ.10 కోట్లు
- ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్లు కేటాయించిన ఉప ముఖ్యమంత్రి

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :**

'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' అనే థీమ్‌తో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం పంచాయతీరాజ్, గ్రామీణ తాగు నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల ద్వారా రూ.100 కోట్ల నిధులను విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ద్వారా విడుదల చేసిన రూ.100 కోట్లకు ఇవి అదనం.

2 లో




- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి జలాలు
- నాలుగు నదుల్ని దాటుకుంటూ.. తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్ష మందికి తాగునీరు అందేలా ప్రణాళిక
- వచ్చే ఏడాది విశాఖ వరకూ..ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం
- నేడు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతిలి

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు



**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:** పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ ... తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు.

కాలువపై నిర్మించిన రెగ్యులేటర్ ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి.. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు

2 పేజీలో..

# స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

కార్యక్రమాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకోవాలని వైయస్ జగన్ స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని సూచించారు.

ఎక్కడా ఏకగ్రీవ ఎన్నికలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీలో ఉండేలా ముందుగానే సన్నద్ధం కావాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకుని, గ్రామాలు, వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షంపై ఒత్తిళ్లు తీసుకురావడం, పోలీసులను ఉపయోగించి బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే ప్రయత్నాలు జరిగితే వాటిని ధైర్యంగా, సంఘటితంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రతి కుటుంబానికి జరిగిన మేలును ప్రజలకు మరోసారి గుర్తుచేయాలని వైయస్ జగన్ సూచించారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు-నేడు, ఆరోగ్యశ్రీ విస్తరణ, విద్యా రంగంలో సంస్కరణలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చిన తర్వాత భిన్నంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రజల మధ్యే ఉండాలి... వారి సమస్యలపై పోరాడాలి... వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి జరిగిన మంచిని గుర్తుచేయాలి. అలా చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం కష్టం కాదు అని పార్టీ శ్రేణులకు వైయస్ జగన్ దిశానిర్దేశం చేశారు.

కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం కొనసాగించాలని, పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసి, ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని వైయస్ జగన్ సూచించారు.

# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

ఈ నిధులతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం ప్రాంతాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో రూ. 90 కోట్లతో 111 పనులను చేపట్టనున్నారు. వీటి ద్వారా సుమారు 141 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రహదారుల నిర్మాణం చేపడతారు. రూ.10 కోట్లతో.. పుష్కరాలకు వచ్చే భక్తులకు రక్షిత తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రాజోలు, పి. గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో బీటీ, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. అవసరమైన చోట గ్రామాల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలను కేవలం రాజమహేంద్రవరం వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితం చేయకుండా, పవిత్ర నదీ పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామంలో భక్తులు పుష్కర స్నానాలు, పూజలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నారు.

**ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత తాగు నీటి సదుపాయాలు :** గ్రామీణ రహదారులతో పాటు ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత తాగు నీటి సరఫరా బాధ్యతలను కూడా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ రూ.7 కోట్ల వ్యయంతో రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మునికూడలిని 'మోడల్ పుష్కర పంచాయతీ'గా అభివృద్ధి చేస్తున్నారు. సప్త ఋషి ఘాట్‌కు సకల హంగులు కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సీసీ రహదారుల నిర్మాణం, టవర్ లైట్ల ఏర్పాటు, మునికూడలి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పుష్కర ఘాట్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తికావస్తున్నాయి.

**ఏపీపీసీబీ నిధులతో సమగ్ర అభివృద్ధి :** కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కేటాయించిన రూ.100 కోట్లను ఆయా జిల్లాల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో వినియోగించనున్నారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించి గోదావరి పుష్కరాలను మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

# గత పాలకులు బటన్ నొక్కారు..

**మొదటి పేజీ తరువాయి**

దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ :** బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామి పాదాల వరకు నీరు పారించామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధార ప్రాంతానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానంతో దేశంలోని నీటి సమస్యలను పరిష్కరించాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్య స్థానంగా మారుస్తాం :** గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు. దీనివల్ల యువత భవిష్యత్తు దెబ్బతిందన్నారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతుకు అండగా నిలిచేందుకు విద్యుత్ యూనిట్ ను రూ.1.5 కే అందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో ఇతర దేశాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్ ఆక్వా ఉత్పత్తులను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని తెలిపారు. నర్సాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు , డెల్టా మోడర్నైజేషన్ వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

**ఎన్డీఏ కూటమికి తిరుగులేదు :** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా పాలనలో భాగం కావాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దని గొడ్డలి పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయని. మున్సిపాలిటీలు, ఆయారాం- గయారాం అనే పరిస్థితి లేకుండా కార్పోరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్షం చేశామని అన్నారు. గొడ్డలి పార్టీ నేతలు బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించేశారని సీఎం ఆక్షేపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరక్కుండా అడ్డుకోవటమే గొడ్డలి పార్టీ ఆలోచన అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

### మరోమారు సిజెపి ఆందోళన !

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సినంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు.ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

## బంగారం కొనొద్దు.. స్వదేశీ వస్తువులే వాడండి..

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఉన్నా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. "విదేశీ దేశాలకు పర్యటనల కోసం వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దు. 'వెడ్ ఇన్ ఇండియా' నినాదాన్ని పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు" అని మోదీ సూచించారు.స్వదేశీ వస్తువులు, సేవలను ఎక్కువగా ఉపయోగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. భారత్ స్వావలంబన సాధిస్తే స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఈ ఏడాది మేలోనూ మోదీ ప్రజలకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట 'వర్క్ ఫ్రమ్ హోమ్', ప్రజా రవాణా వినియోగం పెంచాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని సూచించారు.

## 2.82 కోట్ల మందికి ఎన్‌సీడీ పరీక్షలు పూర్తి

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :** రాష్ట్రంలో అసాంక్రమిక వ్యాధులను ముందుగానే గుర్తించి, సకాలంలో చికిత్స అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 2,82,38,795 మందికి పరీక్షలు పూర్తయ్యాయి. 18 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న జనాభాను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 66.05 శాతం పరీక్షలు పూర్తయ్యాయని రాష్ట్ర



ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సర్వే తాజా పురోగతి నివేదికను రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు మంత్రికి నివేదించారు. 2025 సెప్టెంబర్ 17న ప్రారంభమైన ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంలో భాగంగా 2026 ఆగస్టు 31 నాటికి 3,71,86,846 మందికి సర్వే పూర్తయ్యింది. ఇది లక్ష్య జనాభాలో 86.97 శాతం. సర్వే కోసం వెళ్లినప్పుడు ఇళ్ల వద్ద లేకపోవడం, వలసలు వెల్లడం, మరణాలు ఇతరత్రా కారణాల వల్ల స్థానికులు అందుబాటులో లేరు. ఈ క్రమంలో రాష్ట్ర జనాభా (4,27,56,478)లో ఇప్పటి వరకు 2,82,38,795 మందికి పరీక్షలు(66.05%) జరిగాయి.

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు.

**నదులు.. కొండలు దాటుకుని గోదావరి పరుగులు :** ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు.. అక్విడెక్టులను జలవనరుల శాఖ నిర్మించింది. ఈ నదుల ప్రవాహానికి కొన్ని చోట్ల ఎగువన..ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగింది. ఏలేరు నది బెడ్ లెవల్ కు దిగువన గోదావరి



జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు ఇంజనీర్లు మార్గం సుగమం చేశారు. పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ ను నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణం జరిగింది.

**భవిష్యత్తులో 8 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ :** ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. పాయకరావుపేట అక్విడెక్టు నుంచి సీఎం విడుదల చేయనున్న జలాలు అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక చేసింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా 23.44 టీఎంసీల గోదావరి జలాలు సాగు, తాగు నీటితో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానించేలా 213 కిలోమీటర్ల పొడవున పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం ద్వారా అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎగువ ప్రాంతాలకు గోదావరి నీరు తరలించేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. తద్వారా ఎడమ ప్రధాన కాలువ సహా ఉత్తరాంధ్రలో జిల్లాల్లో మొత్తం 8 లక్ష ఎకరాలకు సాగునీరు, ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

# ఏపీలో ఆ విద్యార్థులకు గుడ్ న్యూస్..

వెల్ల వెల్లడించింది.

ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది.వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజికి వరుసగా రెండోసారి 'రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకం'

## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు, ఆర్థిక వనరుల సమీకరణ, సేవా కార్యక్రమాల విస్తరణకు విశేష కృషికి గుర్తింపు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు డీకే బాలాజి ప్రతిష్టాత్మకమైన 'రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకం' పురస్కారాన్ని వరుసగా రెండోసారి అందుకున్నారు. కృష్ణా జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడంలో భాగంగా పూర్తి స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టడం, సంస్థకు ఆర్థిక వనరులను సమకూర్చడం, సేవా కార్యక్రమాలను విస్తరించడం, సంస్థ అభివృద్ధికి అవసరమైన దిశా నిర్దేశం చేయడంలో కలెక్టర్ డీకే బాలాజి అందిస్తున్న విశేష సహకారాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షే త్రంలో మంగళవారం నిర్వ హించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ డీకే బాలాజీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.రెడ్ క్రాస్ సంస్థను జిల్లాలో మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజలకు మానవతా సేవలను విస్తృతంగా అందించేందుకు కలెక్టర్ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారాన్ని గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు. కాగా, గత సంవత్సరం కూడా రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకాన్ని అందుకున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఈ సంవత్సరం



కూడా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందు కోవడం విశేషం. వరుసగా రెండోసారి ఈ పుర స్కారం అందుకోవడం ద్వారా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డి.ఆర్.కె. ప్రసాద్, సెక్రటరీ శంకర్‌నాథ్, కార్యవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కలెక్టర్ డీకే బాలాజీని అభినందించారు.జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించడం, రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి అంశాల కు మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.



# పేదల ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ భరోసా!

- అర్హుల ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
- జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లు
- పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని 27వ వార్డు బావాజీపేటలో అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు వారి ఇంటి వద్దకే నేరుగా అందించడం ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందో ఆ లక్ష్యం నెరవేరేలా లబ్ధిదారులు వాటిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందించడమే లక్ష్యం

సేవలు సంక్లిష్టంగా ఉండకూడదు

సరళతరం, సులభంగా సేలవలందించేలా చేయాలి

మనమిత్ర ఇప్పటిక ప్రజాదరణ పొందింది

ఇప్పుడు ఏపీ ఒన్ యాప్ కూడా తెస్తున్నాం

దీన్ని కూడా ప్రజలకు చేరువ చేయాలి

అధికారులకు ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ సూచన

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

పౌరులకు ప్రభుత్వం అందించాల్సిన సేవలన్నీ కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ఆన్‌లైన్ లోనే అందుబాటులో ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యం దిశగా ప్రభుత్వ అధికారులు పనిచేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈఓ ప్రఖర్ జైన్ సూచించారు. ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న ఏపీఒన్ మొబైల్ అప్లికేషన్ యాప్ వినియోగంపై అధికారుల్లో అవగాహన కల్పించడం కోసం వివిధ శాఖల అధికారులతో ఆర్టీజీఎస్ రెండు రోజులు వర్క్‌షాపు (కార్య శాల) నిర్వహిస్తోంది. మంగళవారం ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సేవల కోసం ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా అన్ని సేవలను ప్రజలు తాము ఉన్నచోటు నుంచే పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శనంలో ఆర్టీజీఎస్ తీసుకొచ్చిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజాదరణ పొందిందన్నారు. ఇందులో ఇప్పటికే వెయ్యికిపైగా సేవలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దీంతో పాటు ఇప్పుడు ప్రజలకు ఒక మొబైల్ అప్లికేషన్ యాప్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా ఆర్టీజీఎస్ ఏపీఒన్ అనే మొబైల్ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని చెప్పారు.

ఈ యాప్ ద్వారా ప్రజలు తమకు కావాల్సిన అన్ని సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా, అడ్డంకులు లేకుండా సులభంగా పొందేలా దీన్ని తీసుకొచ్చామన్నారు. గతంలో ఒక సర్టిఫికెట్ పొందాలన్నా, ఒక కరెంటు కనెక్షన్ పొందాలన్నా మంజూరు చేసే పద్దతులు ఎంతో సంక్లిష్టంగా ఉండేవని, ఇప్పుడు ఆ పాత పద్దతులకు స్వస్తి పలికి టెక్నాలజీ వినియోగంతో ప్రజలకు సేవలను సరళతరం, సులభతరం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే పలు సేవలను ఎంతో సులభతరం, సరళతరం చేశామన్నారు. ఏపీఒన్ యాప్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా చేయాలని, ఈ యాప్ ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు సైతం ఈ యాప్‌పై అవగాహన పెంచుకుని ప్రజలకు ఈ యాప్ వినియోగం ద్వారా ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. 150 సేవలతో త్వరలో ఆవిష్కరణఏపీ ఒన్ యాప్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. తొలుత 150 సర్వీసులను ఇందులో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తదుపరి ప్రజలకు అవసరమైన సేవల సంఖ్యను పెంచుకుంటూ వెళతామన్నారు. ఈ యాప్‌లో ప్రత్యేకించి సెర్చిబార్ కూడా ఉంటుందని, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో కూడా దీన్ని వినియోగించుకోవచ్చన్నారు. అన్ని రకాల ధృవపత్రాలు ఈ యాపద్వ◌ాతానే డౌన్లోడు చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటు పి. శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులపై కత్తితో గంజాయి నిందితుడి దాడి

❖ ఆత్మరక్షణలో పోలీసుల కాల్పులు! ❖ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు ❖ కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు హెచ్చరిక ❖ ఈగల్ ఐ సాంకేతిక పరిజ్ఞానంతో కంకిపాడు వద్ద నిందితుడిని పట్టుకున్న పోలీసులు ❖ పోలీస్ వాహనం ధ్వంసం.. ఏఆర్ కానిస్టేబుల్, గన్నవరం పిసికి తీవ్ర గాయాలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గంజాయి మత్తులో పోలీసులపైనే పదునైన కత్తితో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ఒడిగట్టిన ప్రమాదకర నేరస్థుడిని కృష్ణా జిల్లా పోలీసులు సమర్థవంతంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి దాడి నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు, ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలి కి గాయమైంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మంగళవారం పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**దేవరపల్లిలో కానిస్టేబుల్‌పై దారుణ దాడి:** ఆగస్టు 31న ఉదయం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని యర్నగూడెం NH-16 సర్వీస్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఆర్ పిసి-2978 వి. వెంకటేశ్వరరావు, పిసి-939 ఎన్. లోవరాజులకు నలుగురు అనుమానాస్పద వ్యక్తులు కనిపించారు. వారిని ఆపి ప్రశ్నించగా, ప్రధాన నిందితుడు అక్కిదాసరి అవినద్ తన గ్యాంగ్‌తో కలసి పదునైన కత్తితో కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. దీనిపై దేవరపల్లి పిఎస్‌లో కేసు నమోదైంది.

**మాణికొండ వద్ద హైడ్రామా – ఆత్మరక్షణలో కాల్పులు:** సాంకేతిక సమాచారం ఆధారంగా కంకిపాడు, గన్నవరం మరియు తూర్పుగోదావరి పోలీసు బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సెప్టెంబర్ 1న తెల్లవారుజామున కంకిపాడు పరిధిలోని మాణికొండ వద్ద వ్యవసాయ పరిశోధనా కేంద్రం సమీపంలో నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వస్తున్న నిందితుడు అవినద్‌ను పోలీసులు చుట్టుముట్టారు.

**పోలీస్ వాహనంపై రాళ్ల దాడి:** పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు రాళ్లతో దాడి చేసి గన్నవరం సిఐ గారి వాహనాన్ని ధ్వంసం చేశాడు.

**మరొక కానిస్టేబుల్‌పై కత్తి దాడి:** అతడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించిన గన్నవరం పిసి-982 దేవిశెట్టి శ్రీను ఛాతీపై నిందితుడు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయమైంది.

**గాలిలోకి హెచ్చరిక కాల్పులు:** సిఐలు పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిందితుడు శాంతించకపోవడంతో మొదటగా ఇద్దరు సిఐలు చెరొక రౌండ్ గాలిలోకి కాల్పులు జరిపారు.

**కాలికి బుల్లెట్ గాయం:** అయినా నిందితుడు కత్తితో పోలీసుల ప్రాణాల మీదికి రావడంతో, కంకిపాడు సిఐ ఆత్మరక్షణార్థం నిందితుడి మోకాలి దిగువ భాగంలో ఒక రౌండ్ కాల్పులు జరిపారు.వైద్యం మరియు తదుపరి చట్టపరమైన చర్యలుకాల్పుల్లో గాయపడిన నిందితుడు అవినద్‌తో పాటు, కత్తిపోట్లకు గురైన పిసి దేవిశెట్టి శ్రీనును తక్షణమే కంకిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిందితుడిని విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కేసు (Cr.No.198/2026) నమోదు చేశారు. కేసు సమగ్ర విచారణ నిమిత్తం గుడివాడ ఎస్డిపిఓను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించారు. పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

**గంజాయి మూకలపై ఉక్కుపాదం!** "శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసుల ప్రాణాలకు ముప్పు తెచ్చే నేరస్థులను ఎంతమాత్రం ఉపేక్షించబోము. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా ఉంటుంది. యువతను నాశనం చేసే గంజాయి రవాణాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం"అని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు.

# పెడపరపూడి మండలంలో పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ వానపాముల, జెడ్పీహెచ్ఎస్ వేంట్రప్రగడ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులతో ఆయన ప్రత్యక్షంగా సంభాషించి, వారి అభ్యసనా ఫలితాలు, విషయ పరిజ్ఞానం మరియు విద్యా పురోగతిని పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, ఉపాధ్యాయులు నోట్‌బుక్ మూల్యాంకనాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు చేస్తున్న తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దేలా తగిన సూచనలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి నోట్‌బుక్‌ను పరిశీలిస్తూ, వారి అభ్యసనా పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచిం చారు. అనంతరం మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'మిషన్ మార్చి-2027' లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి 100 శాతం హాజరుయ్యేలా చర్యలు తీసుకోవాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన ద్వారా వారి అభ్యసనా స్థాయిని మెరుగుపరచాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎఫ్ఎల్ఎన్ వాలంటీర్ల పరిశీలన:మండల పరిధిలోని ఎంపీపీఎస్ పెడపరపూడి, ఎంపీపీఎస్ వేంట్రప్రగడ, ఎంపీపీఎస్ వానపాముల మరియు ఎంపీపీఎస్ పులవర్తిగూడెం పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా నియమితులైన వాలంటీర్లను వారి గృహాల వద్ద జిల్లా విద్యాశాఖ అధికారి కలిశారు.ఈ సందర్భంగా వాలంటీర్లతో మాట్లాడి, విద్యార్థులకు అందిస్తున్న శిక్షణా వివరాల ను తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో 'స్ట్రీమ్' (ప్రవాహం) శ్రేణిలో ఉన్న విద్యార్థుల పఠన, రచన మరి యు గణిత సామర్థ్యాలను మెరుగుపరిచేలా సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యా ర్థుల అభ్యసనా స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ, వారిని 'స్ట్రీమ్' శ్రేణి నుంచి 'మౌంటెన్' (పర్వ తం) లేదా 'స్కై' (ఆకాశం) శ్రేణికి తీసుకువెళ్లేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాలంటీర్లకు సూచించారు.



# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ

## సారంగిపల్లెంలో ఘనంగా 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

పేదలు, వృద్ధులు, వితంతువులు మరియు దివ్యాంగుల కుటుంబాలకు ఆర్థికంగా కొండంత అండగా నిలిచేందుకు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ పథకం ఎంతగానో దోహదపడుతోందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తెలిపారు.మంగళవారం మచిలీపట్నం మండలం సారంగిపల్లెం గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి పింఛను సొమ్మును అందజేశారు. వారి కుశలప్రశ్నలు అడిగి తెలుసుకుంటూ, ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన వివరాలు:తక్షణ ఆర్థిక భరోసా: పింఛను పొందుతున్న వ్యక్తి అనారోగ్యంతో గానీ, వయోభారంతో గానీ అకస్మాత్తుగా మరణిస్తే, వారి కుటుంబం రోడ్డున పడకుండా ఆ మరుసటి నెలలోనే సదరు పింఛనును వారి భార్యకు బదిలీ చేస్తూ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.వేగవంతమైన పంపిణీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలాఖరు లేదా మొదటి తారీఖునాడే ఎంతో వేగంగా, పారదర్శకంగా ఇంటింటికీ పింఛన్లు అందిస్తున్నాం.దేశంలోనే ఆదర్శం: దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి నేతృత్వంలో 'ఎన్టీఆర్ భరోసా' పథకాన్ని ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తు న్నాం. మాట తప్పని ప్రభుత్వం: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా, ప్రజల కష్టాల్లో నిరంతరం తోడుగా నిలవడం తెలుగుదేశం నాయకుల బాధ్యత.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వర ప్రసాద్, నాయకులు మోకా శ్రీను, మోకా నాగరాజు, కొక్కిలిగడ్డ గోపాలకృష్ణ, కొక్కిలిగడ్డ వాకలయ్య, పెదసింగు వెంకటరమణ, బోట్ల రాజేష్, గోకపై విజయ్, పెదసింగు నాగార్జున, బోట్ల సాయి స్వర్ణ మరియు గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనసేనాని జన్మదిన వేడుకలకు మచిలీపట్నం ముస్తాబు

## కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో నేడు భారీ సేవా కార్యక్రమాలు, ర్యాలీ

## 5 వేల మందికి విందు, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు మచిలీపట్నం నగరం సన్నద్ధమవుతోంది. నగరంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో జనసేన నాయకుడు కొట్టే వెంకట్రా వు ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా, వినూత్న రీతిలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు.

**సేవా దృక్పథంతో వేడుకలు...** ఈ సంబరాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా విస్తృత సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉదయం మచిలీపట్నంలోని పలు ఆసుపత్రులలోని రోగులకు పండ్లను పంపిణీ చేయనున్నారు.

**అట్టహాసంగా భారీ ర్యాలీ...** మధ్యాహ్నం 3:00 గంటలకు జిల్లా పరిషత్ సెంటర్ వద్ద భారీ ర్యాలీ ప్రారంభంకానుంది.

**ప్రత్యేక ఆకర్షణగా ట్రాక్టర్లు:** పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో రైతులు స్వచ్ఛందంగా తమ ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొననున్నారు.

**ర్యాలీ మార్గం:** జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ప్రారంభమై చిలకలపూడి, పరాస్‌పేట, చిన్నాపురం, ఆసుపత్రి, కోనేరు సెంటర్, రేవతి సెంటర్ల మీదుగా లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు సాగనుంది. బైకులు, కార్లతో యువత, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొననున్నారు.

**క్రమశిక్షణకు ప్రాధాన్యం:** వాహనదారులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి క్రమశిక్షణతో ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.పారిశుద్ధ్య కార్మికులకు సన్మానంనగర పరిశు భ్రతకు నిరంతరం శ్రమిస్తున్న మచిలీపట్నం మున్సిపాలిటీకి చెందిన మహిళా పారిశుద్ధ్య కార్మికు లను గౌరవిస్తూ వారిని చీరలతో సత్కరించనున్నారు.

**సాయంత్రం కేక్ కటింగ్ & భారీ విందు..** సాయంత్రం 6:00 గంటలకు అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుంది. అనంతరం విచ్చేసిన సుమారు 5,000 మందికి భారీ డిన్నర్ ఏర్పాటు చేశారు.ఈ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించిన సమావేశంలో జనసేన ముఖ్య నాయకులు శాయన శివయ్య, వాలిశెట్టి మల్లి, చిలంకుర్తి పృథ్వీ ప్రసన్న, డా.మాధవి తదితరులు పాల్గొన్నారు. జనసేనాని పుట్టినరోజు సంద ర్భంగా మచిలీపట్నంలో పండుగ వాతావరణం నెలకొంది.



## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**-దేశంలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం ఏపీ: మంత్రి సారథి**

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



దేశంలోనే అత్యధికంగా సామాజిక పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 2,55,107 మంది లబ్ధిదారులకు రూ.112.49 కోట్లు, ఆగిరిపల్లి మండలంలో 9,390 మందికి రూ.4.12 కోట్లు, గ్రామంలో 1,420 మందికి రూ.62.65 లక్షలు పింఛన్లుగా అందిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే పింఛన్లు పెంచారని, ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించడం పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.ఎన్.వి. ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఏపీవో దయాల రాజశేఖర్, గ్రామ కార్యదర్శి వరలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, పామర్తి నరసింహారావు, మదుపల్లి గోపాల్, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏడు నెలలుగా తాగునీటి కష్టాలు..

**-రెండు రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు: మంత్రి సారథి**



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి యాదవ బజార్ లో సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా స్థానికులు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సమస్యలను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఏడు నెలలుగా తాగునీరు అందడం లేదని గట్టు ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక మోటర్లు ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ఇళ్లకు ఇంకా నీరు అందకపోవడంతో మరో రెండు రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.అలాగే యాదవ బజార్‌లో రెండు నెలలుగా చెత్త తొలగించడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంత్రి వెంటనే స్పందించారు. సిబ్బందిని నియమించి బజార్ మొత్తం పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్ స్తంభాలు లేని ప్రాంతాల్లో 21 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వారం రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనులు అందరికీ సమానంగా కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన.



ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. చక్రధర్ విద్యార్థులకు నేత్రదాన ఆవశ్యకత, దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. చక్రధర్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగును నింపవచ్చని తెలిపారు. నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నేత్రదానాన్ని ప్రతి కుటుంబం ఒక మంచి సంప్రదాయంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులతో కలిసి నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదాన ప్రాధాన్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెదపాడు పీహెచ్‌సీ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్ట్ రైతులకు అండ: డాక్టర్ చప్పిడి

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

వెలుగొండ ప్రాజెక్టు రైతులకు అండగా ఉండి ఎంతో మేలు చేస్తుందని మార్కాపురం జిల్లా వాసులకు కాక చుట్టుపక్కల అనేక గ్రామాల రైతులకు ఉపయోగపడేలా వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి రాష్ట్ర ప్రజల తరఫున రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్టీఆర్ పింఛన్ల భరోసా కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం కాకినాడ రూరల్ మండలం గంగనపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కూడా ఒకటో తారీఖున పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని అక్టోబర్ ఒకటో తారీకు నుంచి కొత్త పెన్షన్లు కూడా ఇవ్వడం జరుగుతుందని అందులో ముందుగా భర్తలేని వారికి ప్రాధాన్యత ఉండేలా కృషి చేస్తుందని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మధ్య హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,నారా లోకేష్ కి, బిజెపి పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పెంకె గోవిందరావు సరిత తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 2,53,845 మంది ఫించన్లు దారులకు 111.60 కోట్ల రూపాయిలు పంపిణీ.

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.**

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

స్థానిక ఆదివారపుపేట లైను, రజకులపేట స్వర్ణవార్డు సచివాలయం వద్ద పేదలు సేవలో ఎన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లను మంగళవారం ఇంటింటికి వెళ్ళి ఆప్యాయంగా పలకరిస్తూ, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని పింఛన్లు నగదును స్వయంగా లబ్ధిదారులకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అందజేశారు. లబ్ధిదారులతో మమేకమై వారి ఆరోగ్యపరిస్థితులు, జీవనవిధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ యన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు సొమ్మును పొదుపుగా వాడుకుని రేపటికోసం కొంత పొదుపు చేసుకోవాలని అన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రతిరోజూ కొంతసేపు వ్యాయామం, నడక వంటి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ నెలలో 2,53,845 మంది ఫించన్లు దారులకు 111.60 కోట్ల రూపాయిలు పంపిణీ చెయ్యడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఫించన్లు పంపిణీ 1వ తేదీన నూరుశాతం పంపిణీ చేయుటకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనివార్య కారణాలు చేత 01 వ తేదీన తీసుకోని వారికి 02వ తేదీన పంపిణీ చెయ్యడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో 4932 మంది స్వర్ణగ్రామ, స్వర్ణగ్రామ సచివాలయ , ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లు సొమ్మును ఇంటింటికి వెళ్ళి పంపిణీకి చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఫించన్లు పంపిణీ ఈ రోజు నూరుశాతం పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మిప్రసన్న, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మీ, నగర పాలక సంస్థ అదనపు కమీషనరు డి.శ్రీనివాస రావు, తహశీల్దారు యస్.వి. రవీంద్రనాథ్, ఏవో మహాలక్ష్మి, నగరపాలక సంస్థ, రెవిన్యూ, స్వర్ణవార్డు ఉద్యోగులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు నీటి యాజమాన్య పద్ధతి పాటించాలి

ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి



చాట్రాయి మండలంలోని వరి, ప్రత్తి,మినుము, ఆయిల్ ఫామ్, మామిడి ఇతర పంటలు అన్ని కచ్చితంగా ఈ పంట నమోదు చేయించుకోవలెను. పంట నమోదు చేయించుకోవడం వల్ల రైతులకు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని ప్రకృతి వైపరీత్యాలు వల్ల కలుగు నష్టాలను భర్తీ చేయుటకు, పంట భీమా, కౌలు రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, యంత్రికరణకు పనిముట్లకు రాయితీ సౌలభ్యం ఉంటుంది.సెప్టెంబర్ 15వ తారీకు లోపు రైతులు ఈ పంట నందు పూర్తి చేసుకో వాళ్లని మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ అన్నారు. అంతేకాకుండా ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు గుర్తింపును పొందవలెను. ఈ విశిష్ట సంఖ్యను రైతు యొక్క పొలాన్ని లింక్ చేయడం వలన రైతుకు ఈ పంట ఇన్సూరెన్స్, ఎరువులు వ్యవసాయ పనిముట్లు, పీఎం కిసాన్ లబ్ధిదారులుగా గుర్తించబడుననీ అన్నారు. మంగళవారం చాట్రాయిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఎల్నినో ప్రభావం వలన రాబోవు రోజులలో ఎక్కువగా ఉంటుందనీ కావున రైతులు అందరూ నీటి యాజమాన్య పద్ధతులను పాటించి తక్కువ నీటితో పంటను సాగు చేస్తూ వర్షపు నీటిని తగు జాగ్రత్తలతో వాడుకుంటూ ఉండాలని ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో కోరడమైనది. కోడిగుడ్డు బెల్లం ద్రావణాన్ని, జీవామృతం ఘన జీవామృతం స్ప్రే చేసుకోవడం ద్వారా సూక్ష్మ పోషకాల లోపాన్ని అధిగమించి పంటను ఎక్కువ రోజులు కాలం నీటి ఎద్దడిని తట్టుకునే విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక పెన్షన్లుతో

## వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం

**శావిలి సుభాష్ చంద్రబోస్, ఐటీడీపీ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు.**

ప్రజాభూమి,ప్రతినిధి-వేలేరుపాడు.



మండలంలోని రుద్రమకోట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు తెలుగు దేశం పార్టీ నాయకులు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఐటిడిపి ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు శావిలి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సామాజిక పెన్షన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అని, రాష్ట్రంలో పేదవారికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందనీ, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక లబ్ధి చేకూరేలా పెన్షన్లను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ పాలనతో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని, త్వరలోనే అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందనీ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి అమరవరపు వెంకన్న, కొత్తపల్లి బాబులు, చిట్టూరీ సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కార్యకర్త కుటుంబానికి వైయస్ జగన్ భరోసా

- క్యాన్సర్ బాధిత కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సాయం
- బాధిత కుటుంబానికి చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



ఎటపాక మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దామెర్ల రేవతి కుటుంబానికి పార్టీ నాయకత్వం రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. రేవతి భర్త దామెర్ల రామారావు గొంతు క్యాన్సర్‌తో బాధపడుతుండగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. శస్త్రచికిత్స, రేడియేషన్, కీమోథెరపీకి సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించిన నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను రేవతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పార్టీ కోసం రేవతి చేసిన సేవలను గుర్తించి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నాగులపల్లి ధనలక్ష్మి ఎటపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రేవతి నివాసానికి వెళ్లి రామారావును పరామర్శించారు. అనంతరం రూ.4 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి), గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాకా కామేశ్వరి, యువజన విభాగం మండల అధ్యక్షుడు తోట శశికుమార్, ముత్తిబోయిన రాము, ఎంపీటీసీలు బోరం అంజలి, కమల, సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బుద్ధ ఆదినారాయణ, కాకాని సురేష్, మర్మం శంకర్, అన్నెం జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## పశ్చిమ కలెక్టర్ నాగరాణికి సీఎం చంద్రబాబు ప్రశంసలు

ప్రజా భూమి ప్రతినిధి-మొగల్తూరు



జిల్లా అభివృద్ధి కోసం ఇతర పురుష కలెక్టర్ల కన్న దీటుగా సమర్థవంతమైన సేవలందిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు.జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు విశేషమైన సేవలు అందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు.మొగల్తూరులో నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఉద్దేశించి ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చూపిస్తున్న చొరవ, పనితీరు అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళల్లో ఎంతో శక్తి, సామర్థ్యం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకుంటే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. జిల్లా కలెక్టర్‌గా చదలవాడ నాగరాణి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని ప్రశంసించారు.మహిళా సాధికారతకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉన్న శక్తి, సామర్థ్యాలను గుర్తించి, వాటిని ప్రజాసేవ, సమాజ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలకు సేవ చేయడంలో మహిళలు ఎక్కడా వెనుకబడాల్సిన అవసరం లేదని, సమర్థత, అంకితభావంతో పనిచేస్తే ఏ బాధ్యతనైనా విజయవంతంగా నిర్వహించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పనితీరును స్వయంగా ప్రశంసించడం పట్ల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.

## డయాలసిస్ రోగికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.10 వేలు అందజేత



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

డయాలసిస్ రోగులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్థానిక కూటమి నాయకులు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం జొన్నాడ గ్రామానికి చెందిన దవులూరి అప్పారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. అర్హత ఆధారంగా ఆయనకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ మంజూరు కావడంతో, మంగళవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో రూ.10 వేల పింఛన్‌ను కూటమి నాయకులు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమలాంటి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొంటూ, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), నామాల సూరిబాబు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, చింతలపూడి శ్రీనివాస్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా, రావులపాడులో పెన్షన్ల పంపిణీ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ అన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనలతో రావులపాడు గ్రామంలోని 97వ బూత్ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి శ్రీనివాస్, చేకూరి మురళి, పంచాయతీ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు గౌరవప్రదంగా పెన్షన్లు అందించడం ప్రభుత్వ సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే చేరేలా ఎన్టీఆర్ భరోసా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, లబ్ధిదారుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కొప్పిశెట్టి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రావెల్ లారీని తప్పించబోయి జేసీబీని ఢీకొన్న ద్విచక్రవాహనం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి హరిజనవాడ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆగిరిపల్లి గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్ (సుమారు 40) గాయపడినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. విజయవాడ నుంచి ఆగిరిపల్లి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న గ్రావెల్ లారీని తప్పించుకునే క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న జేసీబీని ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఫిరోజ్‌కు తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## వాయిదాల వివాదంలో మహిళకు గాయం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి-నూజివీడు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం సమీపంలోని వైయస్సార్ కాలనీలో వాయిదాల చెల్లింపు విషయమై ఇద్దరు మహిళల మధ్య వివాదం జరిగినట్లు ఆగిరిపల్లి పోలీసులు తెలిపారు. మెండాల రమాదేవి ఫిర్యాదు మేరకు, సొంగా మౌనికకు తన ఫైనాన్స్ కార్డుపై ఫ్రిడ్జ్ ఇప్పించగా, వాయిదాలు చెల్లించకపోవడంతో చెక్కులు బౌన్స్ అయి పెనాల్టీ పడిన విషయమై ఆమెను ప్రశ్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనపై కత్తితో దాడి చేసినట్లు రమాదేవి ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన రమాదేవిని తొలుత ఆగిరిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

బుధవారం 2 సెప్టెంబరు 2026

# బొప్పరాజుపై భూపతిరాజు విమర్శలు తగవు

### వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాపూజీ

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఏపీ జెఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఐక్య కార్యచరణ ఉద్యమాలకు పిలుపు ఇస్తే వాటిని అపహస్యం చేస్తూ విమర్శిస్తున్న వీఆర్వోల రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు చేస్తున్న విమర్శలను ఖండిస్తున్నట్లు ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ రాష్ట్ర వైస్ చైర్మన్ , వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ పేర్కొన్నారు. ఈ మేరకు ఈ విషయాన్ని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన పిఆర్సి, ఐదు డి.ఏ లు,పదకొండు పెండింగ్ ఏరియర్స్ బకాయిలు విడుదల చేస్తామని హామీనిస్తూ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కూటమి ప్రభుత్వం నేడు మాట తప్పినందున,రాష్ట్రంలోని ఎనిమిది లక్షల ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఉద్యమ పిలుపునిస్తే మీరు ఎవరు ప్రయోజనాలు కోసం ఈ స్క్రిప్ట్ చదువుతున్నారో స్పష్టం చేయాలని భూపతి రాజుని ప్రశ్నిస్తున్నామని అన్నారు .రెండున్నర సంవత్సరాల కూటమి ప్రభుత్వం పాలనలో అనేక ఉద్యమాలు చేసి గత్యంతరం లేని పరిస్థితుల్లో జులై నెల నుండి ఉద్యమానికి వెళ్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ బృందం మరియు 15 మంది ప్రధాన ఐఏఎస్ అధికారులతో చర్చలకు ఆహ్వానించి త్వరలోనే ముఖ్యమంత్రి తో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేస్తామన్న విషయం మీకు తెలియదా అని గుర్తు చేశారు. ఇచ్చిన హామీను మరచి రాష్ట్ర ఆదాయంలో 98% ఉద్యోగుల జీతాలకే సరిపోతుందని ముఖ్యమంత్రి శ్వేతా పత్రం విడుదల చేయడం ఉద్దేశం ఏంటో ప్రజలకు ఉద్యోగులకు మధ్య అగాధం సృష్టించడం కోసం అనే విషయం మీకు తెలీదా భూపతి రాజు అని అన్నారు . మీరు బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులా లేకుంటే వివిధ పార్టీల తెరవెనుక ముసుగులో ఏ ప్రయోజనం కోసం బొప్పరాజు పై విమర్శ చేస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఎనిమిది లక్షల ఉద్యోగులకు పిఆర్సి అమలు అయితే విఆర్వో సోదరులకే కాదు, మీకు కూడా వర్తిస్తుంది అనే విషయం మరిచారా గత జగన్ ప్రభుత్వంలో 92 రోజుల పాటు సుదీర్ఘ పోరాటాన్ని బొప్పరాజు నడిపిన విషయం మీకు గుర్తు లేదంటే మీరు ఉద్యోగుల సంఘం నేత ఎలా అవుతారని ప్రశ్నించారు .జగన్ ప్రభుత్వం లోనే సచివాలయాల ఉద్యోగుల చైర్మన్ వెంకటరామిరెడ్డి తో అనేక జీవోలు సాధించుకున్నామని అన్నారు . ప్రస్తుతం మీరు ఉన్న సంఘానికి రిజిస్ట్రేషన్



నెంబర్ లేదు,సంఘానికి సభ్యత్వం లేదు,రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాలు ఉండవు,రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చలు జరపరు,నూతన జిల్లాల కమిటీలు ఉండవు, సంవత్సరాలు కావస్తున్నా ఉన్న కమిటీలు పనిచేయవు, మండల, డివిజన్ కమిటీలు వేసుకుని సంవత్సరాలు కావస్తున్న కొత్త జిల్లా కమిటీలకు ప్రయత్నం చేయరు. 22 జిల్లాల మద్దతుతో నియమించబడ్డ మీరు,నేడు నాలుగు జిల్లాల నుండి రెండు జిల్లాలకు మీ పరపతి పడిపోవడం బాధాకరమని పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికై మీరు ఎనిమిది సంవత్సరాలలో 18 జిల్లాలకు మీరు ఒక్కసారి కూడా వెళ్ళనే లేదని విమర్శించారు.నువ్వొక్కడివే నాయకుడు కాదని,రాష్ట్రంలో చాలా సంఘాలు ఉన్నాయని, అన్ని విఆర్ఓ సంఘాలు వస్తేనే తప్ప మీ ఒక్కరితోనే చర్చలకు ఆహ్వానించలేమని మంత్రి పదేపదే చెప్తున్న విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు .ఇప్పటికే మీ వలన 15 వేల మంది విఆర్వోలు తీవ్రంగా నష్టపోయారని ఇకనైన మీ నోటిని అదుపులో పెట్టుకుని,మీ పత్రిక ప్రకటనలతో అన్యాయం చేయడం మాని,ఎనిమిది లక్షల మంది ఉద్యోగులకు పి. ఆర్.సి,డి.ఏ,ఏరియర్స్ అమలుకై అన్ని తరగతుల ఉద్యోగులకు న్యాయం చేసేసేందుకు ముందుకు వస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ని మీ స్థాయి మరసి విమర్శించడం తగదని హితవు పలుకుతున్నట్లు పేర్కొన్నారు.రెవెన్యూ శాఖలో విఆర్ఓలపై సచివాలయ శాఖ పెత్తనాన్ని తగ్గించుకునేందుకు,కామన్ డి. డి.వో గా తాసిల్దార్లే ఉండాలని కోరుకుంటూ,పదోన్నతుల పర్సంటేజ్ ను పెంచాలని తదితర సమస్యలకు సానుకూలంగా స్పందిస్తున్న బొప్పరాజు మన విఆర్ఓ ల నాయకులు అందరూ ఐక్యంగా ఉండండి వీఆర్వోలకు త్వరలో న్యాయం జరుగుతుంది అని, అన్ని వీఆర్వో సంఘాలు ఐక్యమై వీఆర్వో లకు మంచి చేయండి అని కోరుతూ బొప్ప రాజు ఉద్యమానికి ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ విఆర్ఓ అసోసియేషన్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు పేర్కన్నారు.ప్రస్తుత ఏపీ జేఏసీ అమరావతి ఐక్య కార్యాచరణలలో భాగంగా జరుగుతున్న ఉద్యమాలలో రాష్ట్రంలోని విఆర్వోలు అందరూ భాగస్వాములు కావాలని ఈసందర్భంగా బాపూజీ పిలుపునిచ్చారు.

## గొల్లు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

దేశంలోనే అత్యధికముగా సామాజిక ఫంక్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో మంగళవారం పండుగ వాతావరణం లో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఉదయం 7 గంటల నుండి నూజివీడు పట్టణం 32 వ వార్డు కొప్పుల వెలమపేటలో వార్డు ప్రధాన కార్యదర్శి దుబ్బిరెడ్డి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు దుబ్బిరెడ్డి నాగేంద్రరావు, రెడ్డి అనిల్ కుమార్, వార్డు మెంబర్ లేలా గోపాలరావులతో కలిసి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి పంపిణీ చేశారు. త్వరలో కూటమి ప్రభుత్వం అర్హులైన వితంతువులకు, వయోవృద్ధులకు సామజిక పెన్షన్లను మంజూరు చేస్తారు అని ఈ సందర్భంగా గొల్లు దుర్గాదేవి అన్నారు.

## నేత్రదానంతో వెలుగులు నింపవచ్చు

### -ఏలూరు డిబిసిఎస్ డీపీయం డాక్టర్ సునీత




**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

నేత్రదానం చేయడం వల్ల అంధులకు చూపు ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఏలూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. 41వ నేత్రదాన పక్షోత్సవాల పురస్కరించుకుని నూజివీడులోని గిఫర్డ్ మెమోరియల్ హాస్పిటల్ లో మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం గిఫర్డ్ హాస్పిటల్ కాలేజీ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ.. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు వ్యక్తులకు చూపునిచ్చి వారి రూపంలో అమరజీవులుగా నిలవవచ్చని ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు ఈ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని దిగ్విజయం చేయడానికి సహకరించిన ఏలూరు గిఫర్డ్ మెమోరియల్ హాస్పిటల్ యాజమాన్యానికి, అధికారులకు మరియు సిబ్బందికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ మోజెస్ పెదపూడి, అడ్మినిస్ట్రేటర్ ఎడ్విన్ పాల్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రవి పండాల, కంటి శాస్త్ర చికిత్స వైద్యురాలు డాక్టర్ పి విజయలక్ష్మి, కంటి విభాగం మేనేజర్ దేవదత్తం, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్, పాలకొల్లు చే మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ స్టవ్ బహుకరణ




**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, కాజ మధ్యాహ్న భోజన పథకానికి ప్రస్తుతం వినియోగిస్తున్న గ్యాస్ స్టవ్ పాడై పోవడంతో వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి అడిగిన వెంటనే 5 వేల రూపాయల విలువైన గ్యాస్ స్టవ్ ను పాలకొల్లులో అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు షేక్ పీర్ సాహెబ్, క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశం కర్ రావు, రాయవరపు సత్తిబాబు,వ్యాయామ ఉపాధ్యాయుడు కంచె వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం

# డబుల్ ఇంజన్ సర్కార్ గా ప్రజా పాలనను సమర్ధంగా అందిస్తున్నాం

- రూ.1.50 లక్షల కోట్లను రెండేళ్లలో సంక్షేమం కోసం ఖర్చు చేశాం
- మహిళలు అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ఉండాలనే 33 రిజర్వేషన్లను పెట్టాం.
- గొడ్డలి పార్టీ మాత్రం అడుగడుగునా అభివృద్ధికి అడ్డు పడుతోంది.
- మొగల్తూరు ప్రజా వేదిక సభలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు

**ప్రజాభూమి ప్రతినిధి-మొగల్తూరు**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్గా ప్రజలకు సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు.31 ఏళ్ల క్రితం సెప్టెంబర్ 1న తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం కోసం పలు కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు.2019 తర్వాత విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ప్రజలు కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నామని అన్నారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.పేదల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఆడబిడ్డలు వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని అమలు చేశామని, ప్రస్తుతం దీపం-2.0 కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు.మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ ఏడాది లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. 'స్వయం' బ్రాండ్ ద్వారా డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు.

**వెనుకబడిన వర్గాలకు అండగా ప్రభుత్వం**

వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. వడ్డెర్లకు మైనింగ్లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలతో పాటు ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

**అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ విమర్శలు**

'గొడ్డలి పార్టీ' అడుగడుగునా రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తోందని చంద్రబాబు విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కూటమి ప్రభుత్వం తన ఆశయాలను సాధిస్తుందని స్పష్టం చేశారు.గురుకుల పాఠశాలల్లో డైట్ చార్జీలను 10 శాతం పెంచామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తుంటే కోర్టు కేసుల ద్వారా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా 350 కేసులు వేసిన పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోందని విమర్శించారు.



**నీటి ప్రాజెక్టులతో కరువు నేలకు జలాలు**

పీఎం సూర్యఘర్ తదితర కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవ స్వామి పాదాల వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు.గోదావరి జలాలను ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించి ఆ ప్రాంత చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు అనకాపల్లి, అనంతరం విశాఖ, వంశధార ప్రాంతాలకు చేరేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం**

గత పాలకుల హయాంలో విద్యుత్ సంస్థలు రూ.1.30 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయని చంద్రబాబు ఆరోపించారు. ప్రస్తుతం విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రాష్ట్రంలో పంటల సాగులో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కోస్తా ప్రాంతంలో ఆక్వా, రాయలసీమలో హార్టికల్చర్కు మంచి అవకాశాలున్నాయని తెలిపారు.అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో ఆక్వా రంగంలో రైతులు నష్టపోకుండా యూనిట్ విద్యుత్ను రూ.1.50 కే అందిస్తున్నామని చెప్పారు. మన ఆక్వా ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ముఖ్యమంత్రికి ఘన స్వాగతం**

మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేరుకోగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మైనార్టీ సెల్ అడ్వైజర్ ఎం.ఎ. షరీఫ్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఐజీపీ జి.వి.జి. అశోక్కుమార్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తదితరులు పాల్గొన్నారు.ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏపీ మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ చైర్పర్సన్ పీతల సుజాత, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీఅప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీ మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ఆత్మీయంగా మాట్లాడారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పోలవరంపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు..

- ఎత్తిపోతల నీళ్లను గ్రావిటీ జలాలంటూ పచ్చి మోసం
- కుర్చీ చోరీ నుంచి ఓట్ల చోరీ.. ఇప్పుడు ప్రాజెక్టుల క్రెడిట్ చోరీ
- వైఎస్సార్, వైఎస్ జగన్ కష్టాన్ని తన ఖాతాలో వేసుకుంటున్న బాబు
- క్రెడిట్ చోరీ చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య
- మాజీ ఎంపీ మార్గాని భరత్.

**ప్రజాభూమి ప్రతినిధి-రాజమండ్రి**

పోలవరం ప్రాజెక్టు గరిష్ట నిర్మాణ పనులన్నీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే రికార్డు స్థాయిలో పూర్తయ్యాయని, అయితే అంతా తానే నిర్మించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు సిగ్గులేకుండా క్రెడిట్ చోరీ చేస్తున్నారని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజమండ్రిలోని వైయస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తోట వెంకటాచలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని ఏలేరు రిజర్వాయర్కు ఎత్తిపోసి అనకాపల్లికి పంపిస్తూ.. పోలవరం ప్రాజెక్టు నుంచి గ్రావిటీ ద్వారా నీళు వదిలామని చంద్రబాబు ప్రజలను పచ్చిగా మోసం చేస్తున్నారని ఆధారాలతో ఎండగట్టారు. 1996లో సొంత మామ ఎన్టీఆర్ కుర్చీ చోరీతో మొదలైన చంద్రబాబు చోరీ నైజం, 2024లో ఓట్ల చోరీ నుంచి నేడు ఇరిగేషన్ ప్రాజెక్టుల క్రెడిట్ చోరీ దాకా కొనసాగుతోందని భరత్ తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ "1996లో సొంత మామ కుర్చీని చోరీ చేయడంతో మొదలైన చంద్రబాబు నైజం ఇప్పటికీ మారలేదు. 2024 ఎన్నికల్లో ఓట్లు చోరీ చేశారు. ఇప్పుడు వైఎస్సార్, వైఎస్ జగన్ రెక్కల కష్టంతో నిర్మించిన ప్రాజెక్టులకు క్రెడిట్ చోరీ చేస్తున్నారు. తన కొడుకు వయసున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను తన ఖాతాలో వేసుకోవడానికి సిగ్గుపడటం లేదు.రేపు పాయకరావుపేట వద్ద పోలవరం ప్రాజెక్టు నీళ్లు అనకాపల్లికి విడుదల చేస్తున్నామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. నేను నొక్కి వక్కాణిస్తున్నా.. పోలవరం హెడ్ వర్క్స నుంచి గ్రావిటీ ద్వారా అనకాపల్లికి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లట్లేదు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి, ఏలేరు రిజర్వాయర్ మీదుగా పంపిస్తూ.. పోలవరం నీరంటూ ప్రజలను ఏమార్చాలని చూస్తున్నారు.

తోట వెంకటాచలం పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ ఫస్ట్ ఫేజ్ పనులను 2008 మార్చి 14న ప్రారంభించిందే వైఎస్సార్. ఆ రోజుల్లో పోలవరం కాలువలు తవ్వుతుంటే 'ఇది జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం.. కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే' అని విషం కక్కిన చంద్రబాబుకు, ఇవాళ అవే కాలువల వద్ద నిలబడి రిబ్బన్లు కట్ చేయడానికి సిగ్గు లేదా? పోలవరం కుడి కాలువను 90 శాతం, ఎడమ కాలువను 70 శాతం పూర్తి చేసింది దివంగత ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖరరెడ్డే.పోలవరం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 45.72 మీటర్లు నిలబెడితేనే ఉత్తరాంధ్రకు గ్రావిటీ ద్వారా నీళ్లు వెళ్లడం సాధ్యమవుతుంది. కానీ, చంద్రబాబు ఆగస్టు 28, 2024న కేంద్రంతో కేవలం 41.15 మీటర్ల ఎత్తుకు పరిమితం చేస్తూ సంతకం పెట్టారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రమంత్రిగా గజేంద్రసింగ్ షెకావత్ ఉన్నప్పుడు... సీడబ్ల్యూసీ ద్వారా రూ.48 వేల కోట్లకు క్లియరెన్స్ ఇస్తే, చంద్రబాబు దాన్ని రూ.30,436 కోట్లకు కుదించి సంతకాలు చేసి పోలవరాన్ని కేవలం ఒక బ్యారేజీగా, ఎత్తిపోతల ప్రాజెక్టుగా మార్చేశారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పర్ కాఫర్ డ్యామ్ కట్టకుండానే నీళ్లు వదిలేసి, పోలవరం ప్రాజెక్టు గుండెకాయ లాంటి డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడానికి కారణమైన వ్యక్తి చంద్రబాబే. ప్రాజెక్టును సర్వనాశనం చేసినందుకు ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి గారే స్పిల్ వే, హైడ్రాలిక్ గేట్లు, అప్పర్, లోయర్ కాఫర్ డ్యామ్లను పూర్తి చేసి ప్రాజెక్టును నిలబెట్టారు.

181 కిలోమీటర్ల ఎల్ఎంసీ కాలువ పనుల్లో 70 శాతం పనులు రాజశేఖర్రెడ్డి గారి హయాంలోనే పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం కాలువ పనులు మాత్రమే ఈ రెండున్నరేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసింది. సాధారణంగా ప్రాజెక్టుల అంచనాలు పెరిగినా 10 శాతమో, 15 శాతమో పెరుగుతాయి. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనుల అంచనాలను అడ్డగోలుగా 200 నుంచి 300 శాతం పెంచి చంద్రబాబు సర్కార్ ప్రజాధనాన్ని లూటీ చేసింది.ప్యాకేజీ-1 అంచనా వ్యయం రూ.20 కోట్లు ఉంటే దాన్ని రూ.70 కోట్లకు పెంచారు.ప్యాకేజీ-3 అంచనా వ్యయం రూ.30 కోట్లు ఉంటే రూ.112 కోట్లకు పెంచారు.ప్యాకేజీ-6లో అంచనా వ్యయం రూ.98 కోట్లు ఉంటే రూ.336 కోట్లకు పెంచారు.ప్యాకేజీ-5.5లో అంచనా వ్యయం రూ.81 కోట్లు ఉంటే రూ.307 కోట్లకు పెంచారు.ప్యాకేజీ-8.8లో అంచనా వ్యయం రూ.20 కోట్లు ఉంటే రూ.76 కోట్లకు పెంచారు. ఇలా వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని టీడీపీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. ఇది ప్రభుత్వ సొమ్ము కాదు.. ప్రజల సొమ్ము.

# సాగునీటి సలహా మండలి (ఐఏబి) సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జెసి అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ టాకింగ్ పాయింట్స్ నూజ కాల్వతో నాది 1994 నుంచి అనుబంధం. ముప్పై సంవత్సరాల అనుభవంలో ఇంత విపత్తు చూడలేదు. తుంగభద్ర హై లెవెల్ కెనాల్, గుంతకల్లు బ్రాంచి కెనాల్ కింద రైతుల కష్టాలు 30 ఏళ్లుగా చూస్తున్నాను. క్షేత్ర స్థాయిలో తాను డ్యాములు, నీటి స్థితి వివరాలను స్వయంగా చూస్తూ అధికారులతో సమీక్ష చేయడం ద్వారా అవగాహన ఉంది. తాను నిరంతరం క్షేత్ర స్థాయిలో రైతాంగం పడే కష్టాలు కళ్ళారా చూసాను. ప్రకృతితో రైతులు పోరాటం చేస్తుంటారు. సాగుకు నీరు ఇవ్వడంపై చాలా కసరత్తు చేశాము. రెండు నెలల కిందటే ఆరుతడి పంటలు వేయండి అని చెప్పాం. ముందే రైతులను ప్రభుత్వం నుంచి అప్రమత్తం చేశాము. టిబి డ్యామ్ గేట్లు డ్యామేజ్ అయిన సమయంలో ఎంతగానో బాధ పడ్డాను. చరిత్రలో నిలిచిపోయేలా ఒకే సీజన్లో అన్ని గేట్లు ఒకేసారి మార్చడం జరిగింది. ఏదీ డ్యాం కి ఉన్న 33 గేట్లు మారిస్తే అది అల్ ఇండియా రికార్డు అయింది. రెండేళ్ల కిందట గేటు కొట్టుకుపోతే వెంటనే వేశాము. హెచ్.ఎల్.సిలో ఎనిమిది బ్రిడ్జిలు కూలిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటే గత ఐదు సం.లలో పట్టించుకోలేదు. అలాగే వదిలేస్తే కొత్తవి నిర్మించాం. కేంద్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు జూలై 31, 2027 వరకు సరిపడా నీటిని నిల్వ చేసుకోవాలని తెలిపారు. కృష్ణ యాజమాన్య బోర్డు సమావేశం జరగాల్సింది వాయిదా పడింది. అయినా కూడా ఏ విధంగా రైతులకు నీళ్లు ఇవ్వాలనే అంశంపై ప్రయత్నం చేస్తున్నాం. ముందుగా జిల్లాలో త్రాగునీరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ముందుగా తాగునీటికి నీళ్లు ఇచ్చాకే చెరువులకు ఇవ్వాలి అన్న విషయం ఆలోచిస్తాం. రాష్ట్రంలో గోదావరి నీళ్లు వచ్చే చోట మినహా ఎక్కడా పంటలు వేయకూడదు అని నిర్ణయించాం. డ్రైస్పెల్ వల్ల వేస్టేజ్ అయ్యే నీరు పెరిగిపోయింది. గేట్ల మార్పు కి ఇరిగేషన్ శాఖ మంత్రి ఎంతగానో సహకరించారు. వెలిగొండ రిజర్వాయర్ ఒక చరిత్ర మార్కాపురంలో కూడా నీటి సమస్య ఎక్కువగా ఉంది. వెలుగొండ ప్రారంభం చారిత్రాత్మకం. ఉమ్మడి ప్రకాశం జిల్లా కష్టాలు తీర్చేందుకు సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విపత్కర ఎల్నినో నేపథ్యంలో రైతులు వరి, మిర్చి వేయొద్దని సూచన అందరికి చేరాల్సిన అవసరం ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ సహకరించాలి. 80 రోజుల ప్రణాళికను ఇరిగేషన్ శాఖ వారు తయారు చేయాలి. నవంబర్ 10 వరకు టీబీ డ్యాం నీరు వచ్చేలా అధికారులు ప్లాన్ చేయండి. తుంగభద్ర డ్యామ్ మూసివేసేలోపు 10వ తేదీ నవంబర్ లోపు వచ్చే నీటిని వీలైనంత ఎక్కువగా మనం వాడుకునేలా ఉండాలి. రైతులు మిర్చి, వరి వేయరాదు. నీటిపై 4వ తేదీ అనంత రం మరోసారి చర్చించి క్లారిటీ ఇద్దాం. పీఏబీఆర్ లో నీటి నిల్వలు తగ్గకుండా చూడండి. వరి, మిర్చి పంటలకు నీరు ఈ సారి ఇచ్చే అవకాశం లేదు. ఆరుతడి పంటలకు మాత్రమే నీరు రైతులతో అనవసరంగా ఖర్చుపెట్టించే పనులు చేయొద్దని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చిన నీటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో సలహాలు ఇవ్వండి. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు సక్రమంగా అవగాహన కల్పిస్తూ వారు అనవసరంగా పెట్టుబడి పెట్టీ నష్టపోకుండా కృషి చేస్తున్నాం. పంట వేసిన ప్రతి రైతును కాపాడడానికి చర్యలు తీసుకుంటాం. ఉద్యాన పంటలు ఏ విధంగా కాపాడాలో అధికారులు చర్యలు చేపట్టండి..రైతులకు అవగాహన కల్పించాలి. పరిస్థితిని రైతులకు వివరించండి. రైతుల విషయంలో ఎక్కడ బలవంతపు చర్యలు వద్దు. ఈ రోజు నుంచే ఆరుతడి పంటలకు కింద నీరు విడుదల చేస్తున్నాం.



## నాయీ బ్రాహ్మణులకు అండగా టిడిపి

### -అన్ని విధాలా ఆదుకుంటామని హామీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా వుంటూ ఆదుకొంటుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీలు పేర్కొన్నారు. మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలో అనేకమంది నాయి బ్రాహ్మణులు కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవల కాలంగా కార్పొరేట్ సెలూన్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అనేక మందికి కనీసం కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోయారు. స్థానికంగా తరతరాలుగా నాయి బ్రాహ్మణులు తమ కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, అయితే కార్పొరేట్ సెలూన్ షాప్ ల వల్ల స్థానిక నాయి బ్రాహ్మణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నాయి బ్రాహ్మణులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇందుకువ్యక్తిగత కార్యదర్శులు స్పందిస్తూ నాయి బ్రాహ్మణులకు టిడిపి పార్టీ ఎప్పుడు అండగానిలుస్తుందని తెలిపారు. నాయి బ్రాహ్మణ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం పట్ల నాయి బ్రాహ్మణులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేరాల కట్టడే లక్ష్యం -శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత

### ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు -వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌బాబు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని నూతన వన్‌టౌన్ సీఐ జె.ప్రసాద్‌బాబు తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించేలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంగళవారం హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా జె.ప్రసాద్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న జె.ప్రసాద్‌బాబును పోలీసు ఉన్నతాధికారులు హిందూపురం వన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వన్‌టౌన్ పరిధిలోని శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అన్నారు. వన్‌టౌన్ పరిధిలో ఎలాంటి నేరాలు, అసాంఘిక



కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు రౌడీయిజం, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అసాంఘిక కార్యకలాపాల సమాచారం అందించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో జీవించేలా శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

## "అనంతపురం జిల్లా సాగునీటి పరిస్థితులపై సమగ్ర సమీక్ష"

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన సాగునీటి సలహా మండలి (ఐఏబి) సమావేశంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జేసీ అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో కలిసి పాల్గొన్నాను. ఈ సందర్భంగా జిల్లాలో సాగునీటి పరిస్థితులు, నీటి లభ్యత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రానున్న పంట కాలానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించాం. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రతి గ్రామంలో రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలి. వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎల్‌నినో ప్రభావాన్ని రైతులకు వివరించి, పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసుకునేలా సూచనలు ఇవ్వాలి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా వ్యవసాయం తర్వాత పశుపోషణ కూడా కీలకమైన రంగం. కాబట్టి పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పశువులకు అవసరమైన గ్రాస్ పెంపకానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. అదేవిధంగా ప్రజలందరికీ తాగునీరు అందించడం అత్యంత ముఖ్యమైన బాధ్యత. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాను. అనంతపురం జిల్లాలోని పండ్ల తోటలను కూడా రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యాన పంటలకు అవసరమైన నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు తగిన సూచనలు అందించాలని హార్టికల్చర్ శాఖ అధికారులను కోరాను. క్లిష్టమైన ఈ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా, అందుబాటులో ఉన్న నీటిని ప్రతి బొట్టునూ సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

## అనంతపురం రెడ్ క్రాస్ జిల్లా శాఖకు ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్

### -: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 2024--25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సర్వసభ్య సమావేశం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన జిల్లాలు, వ్యక్తులు, సంస్థలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం జిల్లా శాఖకు ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్ లభించడం విశేష గౌరవంగా నిలిచింది. వీటిలో రెండు మెడల్స్ మెంబర్‌షిప్ కేటగిరీలో, మరో మూడు మెడల్స్ సామాజిక సేవ/కార్పొరేట్ సామాజిక బాధ్యత కేటగిరీలో రెడ్ క్రాస్‌కు విశేష సహకారం అందించిన సంస్థలకు లభించాయి. మెంబర్‌షిప్ కేటగిరీలో డా. వి.వినోద్ కుమార్, అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు, అలాగే వాకా శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఆర్డీఓ, గుంతకల్లు, గవర్నర్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గవర్నర్ మెడల్‌ను అందుకున్నారు. సామాజిక సేవ/ కేటగిరీలో అనంతపురం రెడ్ క్రాస్‌కు విశేష సహకారం అందించిన మూడు సంస్థలకు గవర్నర్ మెడల్స్ ప్రదానం చేశారు. సంస్థ బ్లడ్ సెంటర్‌కు సుమారు రూ.70 లక్షల విలువైన బ్లడ్ బ్యాంక్ పరికరాలను అందించింది. సంస్థ తరఫున యాంగ్ యోంగ్‌డ్యూక్, మేనేజింగ్ డైరెక్టర్, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గవర్నర్ మెడల్‌ను అందుకున్నారు. అదేవిధంగా, సంస్థ రెడ్ క్రాస్‌కు సుమారు రూ.55 లక్షల విలువైన సహకారం అందించినందుకు గవర్నర్ మెడల్‌ను అందుకుంది. సంస్థ అందించిన సహకారంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ అఫెరిసిస్ మెషిన్, 25 ఖెవా సోలార్ పవర్ సిస్టమ్, ప్లేట్‌లెట్ అజిటేటర్ కమ్ ఇంక్యుబేటర్ వంటి కీలక సదుపాయాలు ఉన్నాయి. సంస్థ తరఫున దోమన్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అవార్డును అందుకున్నారు. అలాగే, సప్తగిరి చాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మహమ్మద్ హనీఫ్ కార్యకలాపాలకు సుమారు రూ.10 లక్షల విలువైన సహకారం అందించినందుకు గవర్నర్ మెడల్‌ను అందుకుంది. అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ శాఖకు లభించిన ఈ ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్, జిల్లా శాఖ అందిస్తున్న మానవతా సేవలకు, రెడ్ క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడంలో వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు, దాతలు అందిస్తున్న విలువైన సహకారానికి ఒక ముఖ్యమైన గుర్తింపుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం జిల్లా శాఖ తరఫున జిల్లా శాఖ ట్రెజరర్ సుంకర రమేష్, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, బిసాతి భరత్, డాక్టర్ కె. లక్ష్మీనారాయణ, దాసరి భరత్ కుమార్, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ.ఆనంద్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఢ జిల్లా మేజిస్ట్రేట్ అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు, గవర్నర్ మెడల్స్ అందుకున్న అవార్డీన్ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ క్రాస్ మానవతా సేవలకు వారు అందించిన విలువైన సహకారాన్ని అభినందించారు.

## నేడు వైఎస్సార్ 17వ వర్ధంతి. పుట్లూరు మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి.

ప్రజాభూమి, పుట్లూరు.

వైఎస్సార్‌సీపీ అధినేత శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి పిలుపు మేరకు, సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ఆదేశాలతో సెప్టెంబర్ 2న దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 17వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం పుట్లూరు మండల కేంద్రంలో డాక్టర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందని పుట్లూరుమండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి కోరారు.

## ఆత్మ రక్షణలో మెళకువలు నేర్చుకోవాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఆత్మ రక్షణలో మెళకువలు నేర్చుకుని అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం ఆయా క్లబ్ ల ఆధ్వర్యంలో రహమత్‌పురం మదర్ థెరిసా పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థినిలు ఆత్మ రక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆత్మ రక్షణలో మెళకువలు నేర్చుకోవడం వల్ల ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణ ఎంతో అవసరమన్నారు. నిత్యం అభ్యసనం చేయడం వల్ల ఆత్మ రక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం శిక్షకులు చరణ్ విద్యార్థులకు ఆత్మరక్షణ మెళకువలను ప్రత్యక్షంగా డెమో ద్వారా నేర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, కార్యదర్శి స్వాతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథ్, రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### -జంక్‌ఫుడ్‌కు దూరంగా.. పౌష్టికాహారంతో ఆరోగ్యంగా

ప్రజాభూమి, హిందూపురం టౌన్




చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని వేణు విద్యావిహార్ కరస్పాండెంట్ వేణుగోపాల్ సూచించారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార దినోత్సవంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, "నో జంక్‌ఫుడ్.. ఓన్లీ న్యూట్రిషన్ ఫుడ్" అనే నినాదంతో పిల్లలను ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల వైపు మళ్లించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు జంక్‌ఫుడ్ తినడం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలను కూలంకషంగా వివరించారు. ఇంటి నుంచే పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల పండ్లు, కూరగాయల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆయా పండ్లు, కూరగాయల ఉపయోగాలు, వాటిలో ఉండే పోషక విలువలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తలకోన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మికతతో పాటుగా.. పర్యాటక ప్రాంతంగా కూడా తీర్చి దిద్దుతాం

### -: ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

తలకోన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ,ఆలయ ధర్మకర్తలతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయ నమూనా చిత్రాన్ని చూపిన అధికారులు ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాన్ని వివరించారు. గర్భగుడి , కోనేరు పనులను పరిశీలించిన ఆయన గుత్తేదారుకి కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. వచ్చే శివరాత్రి లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, గుత్తేదారుని కోరిన ఎమ్మెల్యే అత్యుత్తమ నాణ్యతతో దేవాలయ నిర్మాణం జరగాలని వారిని ఆదేశించారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేవిధంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను , ధర్మకర్తలి సభ్యులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

## చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

### -సత్ఫలితాలిస్తున్న మంత్రి సవిత సమీక్షలు

ప్రజాభూమి, అమరావతి

: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 2019-24 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది. చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంత్రి సవిత ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖాధికారులు రాష్ట్రంలోని వివిధ చేనేత సహకార సంఘాలకు రూ.1,03,38,678లను మంగళవారం చెల్లించారు. వివిధ శాఖలు, గురుకులాల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి ఈ చెల్లింపులు చేశారు. 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆ చెల్లింపులను జమ చేశారు.

# ప్రభుత్వ సేవల్లో.. సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం..!

### సమాచార శాఖ జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి,కడప: అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని.. జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సిబ్బంది విధులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా సమాచారాన్ని అందించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని కోరారు. జోన్-4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడి రమేష్, డీఇఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు

## తొండూరులో డిజిటల్ సేవలకు కొత్త బాట

### డిజిటల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం: కడప జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం



ప్రజా భూమి తొండూరు,

తొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ కేంద్రాల వెరిఫికేషన్ ప్రక్రియను కడప జిల్లా కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం పూర్తి చేశారు. కేంద్రాల పనితీరు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా అందించడంలో కామన్ సర్వీస్ సెంటర్లు కీలకంగా పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి రావడంతో ప్రజలు ప్రతి చిన్న పనికోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. కామన్ సర్వీస్ కేంద్రాల ద్వారా ఆధార్ సంబంధిత సేవలు, పాన్ కార్డు సేవలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, వివిధ ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు, ధృవపత్రాల కోసం దరఖాస్తులు, బ్యాంకింగ్ సేవలు, బీమా తదితర డిజిటల్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెరిఫికేషన్ సందర్భంగా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల వివరాలను, అవసరమైన పరికరాలు, ఇంటర్నెట్ సదుపాయం, సేవల నిర్వహణ తీరును పరిశీలించారు. కామన్ సర్వీస్ కేంద్ర నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సేవల విషయంలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు సరైన సమాచారం అందించాలని తెలిపారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు డిజిటల్ సేవలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలు మరింత మందికి చేరువ అవుతాయని ఆయన అన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న కామన్ సర్వీస్ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొండూరు మండలంలో కామన్ సర్వీస్ కేంద్రాల ద్వారా ప్రజలకు మరిన్ని డిజిటల్ సేవలు అందుబాటులోకి రానుండటంతో స్థానికులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులకు ప్రయోజనం కలగనుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకు తీసుకురావడంలో కామన్ సర్వీస్ కేంద్రాలు వారధిగా నిలుస్తాయని జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పీవీఎల్ కామన్ సర్వీస్ సెంటర్ పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం

## పులివెందులలో చందమామ కేఫ్ ప్రారంభించిన ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల కడప రోడ్డులోని పాలకేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చందమామ కేఫ్ ను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ప్రొప్రైటర్, మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఆహ్వానం మేరకు ఎంపీతో పాటు మున్సిపల్ వైకాపా ఇన్చార్జిలు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, తొండూరు మండల ఇన్చార్జ్ వైఎస్ మదనమోహన్ రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీష్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ కోడి రమణ హాజరయ్యారు. నిర్వాహకులు బాణసంచా పేల్చి, పూలహారాలు, దుశ్శాలువాలతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేఫ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కస్టమర్లు దేవుళ్లతో సమానమని, వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి స్వచ్ఛమైన, కల్తీలేని టీ అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు బ్రహ్మానందరెడ్డి, బయపురెడ్డి, సాంబశివారెడ్డి, దేరంగుల చంద్రమౌళి, కడియాల లక్ష్మీనారాయణ, రమేష్ నాయుడు, కొంగనపల్లి మురళి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి కుట్రలను తిప్పికొడదాం - వైకాపా జెండా ఎగురవేద్దాం: ఎంపీ అవినాష్ రెడ్డి

### ఇది కూటమి ప్రభుత్వం కాదు.. కుట్రల ప్రభుత్వం

ప్రజాభూమి, పులివెందుల

కూటమి నాయకుల కుట్రలను తిప్పికొట్టి జరగబోయే ఎన్నికల్లో పులివెందులలో వైకాపా జెండా ఎగురవేద్దామని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాస ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో ఆయన మాట్లాడుతూ, ఇది కూటమి ప్రభుత్వం కాదు కుట్రల ప్రభుత్వమని, రైతులను దగా చేసిన ప్రభుత్వమని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 27 నెలలైనా రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. పులివెందులకు రెండేళ్లుగా ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని, పెండింగ్ పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యా రని అన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదన్నారు. ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగ భృతి రూ. 3000 ఇంతవరకు అమలు చేయలేదని, పెట్రోల్ ధరలు, నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు, రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అన్నదాతల గోడు పట్టించుకునే వారే లేరని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యమని తెలిపారు. అంతకుముందు నియోజక వర్గం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విని కొన్ని సమస్యలను అధికారులతో ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు.



## పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ప్రజాభూమి, పులివెందుల

పరీక్షల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన పులివెందుల పట్టణంలో చోటుచేసుకుంది. పులివెందుల మండలం అచ్చివెల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి రాజారెడ్డి, తులసమ్మ దంపతుల కుమారుడు రామిరెడ్డి హర్ష తేజ రెడ్డి (29) హైదరాబాద్‌లో సీఏ చదువుతున్నాడు. ప్రస్తుతం కుటుంబం పులివెందుల పాత బస్టాండ్ సమీపంలోని ఆదర్శ పాఠశాల ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో హర్ష తేజ మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం తల్లిదండ్రులు తోట వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న ఎస్ఐ తిమోతి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు

### - ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ

### - టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని రెడ్డయ్య కాలనీలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి వీరభద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. గతంలో రూ. 3 వేలు ఉన్న పింఛన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రూ. 4 వేలకు పెంచి అందిస్తోందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి అందుతున్న పింఛన్ చంద్రన్న సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను అందించనున్నట్లు పసుపులేటి వీరభద్ర తెలిపారు.

## వైయస్ భారతి రెడ్డి ని కలిసిన గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ మాజీ చైర్మన్ సుధీకర్ రెడ్డి




ప్రజాభూమి, లింగాల

పులివెందుల రెండు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి రెడ్డిని ఆమె నివాసంలో మంగళవారం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ మాజీ చైర్మన్ చింతకుంట సుధీ కర్ రెడ్డిఆమెనుమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైయస్ భారతి రెడ్డి పులివెందుల పరిస్థితుల గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి వైకాపాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

## కూటమి పాలనలో పెరుగుతున్న ధరల భారం

### - నిత్యావసర ధరలు తగ్గించాలి

### - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, వంట నూనెలు, ఎండుమిరప, చింతపండు, చక్కెర తదితర వస్తువుల ధరలు ఏడాది కాలంలో 40 నుంచి 70 శాతం వరకు పెరిగాయని తెలిపారు. ఏమి కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు అనే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ. 21,243 కోట్ల అదనపు భారాన్ని వినియోగదారులపై మోపిందని ఆరోపించారు. కర్ణాటక, తమిళనాడుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 6 నుంచి రూ. 10 వరకు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యాట్, అదనపు వ్యాట్, రోడ్డు డెవలప్‌మెంట్ సెస్సును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎరువుల ధరలు 50 కిలోల బస్తాపై రూ. 500 నుంచి రూ. 800 వరకు పెరిగాయని, వాటిని తగ్గించి రైతులపై భారం తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వెంకటేశు, రామాంజనేయ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## నడి రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్.. ప్రజలకు అవస్థలు

### – సురక్షిత ప్రాంతానికి తరలించి..ప్రజలకు సహకరించాలని వినతి



సిద్దవటం, ప్రజాభూమి: మండలంలోని మాధవరం-1 రోడ్డు నంబర్ 12లో రహదారి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి అవతలి వైపునకు కలపలేని పరిస్థితి నెలకొంది. గ్రామం ఏర్పాటైన సమయంలో నడి వీధిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఏళ్లు గడిచినా అక్కడి నుంచి తొలగించకపోవడంతో రాకపోకలకు ఆటంకంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలు లేక దారంతా చెట్లు, పొదలతో నిండిపోయి అడవిని తలపిస్తోందని, వర్షపు నీరు నిలిచి వాహనాలు, పాదచారులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ సోమవారం విద్యుత్ అధికారులకు చరవాణి ద్వారా స్థానికులు వినతి తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## పెన్నాలో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

### –యంత్రాలతో తవ్వకాలకు అనుమతులు లేవు: తహసీల్దార్ విజయ్‌కుమార్

సిద్ధవటం, ప్రజాభూమి: పెన్నా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యంత్రాల ద్వారా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం సిద్ధవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సిద్ధవటం, మూలపల్లి, రాజంపేట, వంతాటిపల్లి, మాచుపల్లి, గాండ్లపాలెం, దేగనవాండ్లపల్లె గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక విధానం ముసుగులో కొందరు అక్రమంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చోట్ల రహదారులను పూడ్చివేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

### - జంగాలపల్లెలో ఎస్సై హారిక పల్లెనిద్ర



సిద్ధవటం, ప్రజాభూమి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండల పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని జంగాలపల్లె ఎస్సీ కాలనీలో ఎస్సై హారిక ఆధ్వర్యంలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్సై హారిక మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సెల్‌కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పల్లెనిద్ర చేపట్టి స్థానికులకు ఎన్నికలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గొడవలు, వర్గ విభేదాలు, ఘర్షణలకు తావివ్వకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా అలజడులకు పాల్పడే వారిపై ఎంతటి వారైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

### –ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్



సిద్ధవటం, ప్రజాభూమి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమరావతి జేఏసీ పిలుపు మేరకు మంగళవారం సిద్ధవటం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన డీఏలు, ఐఆర్, పీఆర్సీ తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## చంద్రబాబు మరో 15 ఏళ్లు సీఎంగా కొనసాగాలి

### - దేశంలోని ముఖ్యమంత్రులకు ఆయన ఆదర్శం: -కొమరా వెంకట నరసయ్య



ఒంటిమిట్ట, ప్రజాభూమి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మరో 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. పరిపాలనా దక్షతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నడిపిస్తూ దేశంలోని ఇతర ముఖ్యమంత్రులకు చంద్రబాబు మార్గదర్శిగా నిలవడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పారిశ్రామిక, విద్యా, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు, అభివృద్ధి వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని వెంకట నరసయ్య అన్నారు. పలు రాజకీయ అవరోధాలను అధిగమిస్తూ అన్ని వర్గాల ప్రజలకు నిష్పాక్షిక, పారదర్శక పాలన అందించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. మరో ఐదేళ్లలో సువర్ణాంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఐటీ రంగానికి గతంలోనే ప్రాధాన్యం కల్పించిన చంద్రబాబు, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారించడం భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనకరమని వెంకట నరసయ్య పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో పరిపాలనా దక్షతతో గుర్తింపు పొందిన చంద్రబాబు అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు.

## మిషన్ వాత్సల్యలో ఖాళీ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతి జిల్లాలోని మిషన్ వాత్సల్య పథకం పరిధిలోని చిల్డ్రన్ హోమ్, ఎస్ ఎ ఎ యూనిట్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి శ ఎస్. వసంతబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 01 నుంచి సెప్టెంబర్ 10, 2026 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా స్వయంగా కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టును బట్టి రూ.7,944 నుంచి రూ.18,536 వరకు వేతనం ఉంటుందన్నారు. సంబంధిత విద్యార్హతలు, అనుభవం, వయస్సు తదితర అర్హతలు నోటిఫికేషన్ ప్రకారం ఉంటాయని తెలిపారు. దరఖాస్తు రుసుముగా ఓసి అభ్యర్థులకు రూ.500, ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులకు రూ.400 నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చిల్డ్రన్ హోమ్‌కు దగ్గరగా స్థానిక నివాసం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు ఫారం తదితర సమాచారం తిరుపతి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో,జిల్లా కార్యాలయ నోటిస్ బోర్డులో అందుబాటులో ఉన్నాయన్నారు.

## నాయుడు పేటలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు

### నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్.రఫీ

ప్రజా భూమి ప్రతినిధి(నాయుడుపేట).



కూటమి ప్రభుత్వం ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకే పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు పేదలకు,అవ్వ తాతలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు నాయుడుపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అందని వారి వివరాలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ల దృష్టికి తీసుకువెళ్ళి వారికి పింఛన్లు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 68వ భూతి ఇన్చార్జి షేక్ మహమ్మద్ రఫీ,సచివాలయం సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నాయుడుపేట జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.






సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ శ్రీమతి నెలవల విజయశ్రీ ఈరోజు నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ హైస్కూల్) ను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్యం, తరగతి గదుల నిర్వ హణ తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి న ఎమ్మెల్యే విజయశ్రీ గారు వారి చదువు, హాజరు, పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ తనిఖీలో టీడీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, పోలేరమ్మ గుడి చైర్మన్ నానా బాల సుబ్బారావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, క్లస్టర్ ఇంచార్జ్ నరోత్తమ రెడ్డి, టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు ఇమ్మడిచెట్టి వెంకటేశ్వర్లు, జీవీఆర్ నాయుడు, జోలపాటి మస్తాన్, పలుకూరు ముత్యాలయ్య, అరగొండ రేవతి, సునీతమ్మ, బేబీ భవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు. "విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యం -- ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం" అని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం ఉమ్మడి జిల్లాల గ్రంధాలయ సంస్థ చైర్మన్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంటలో ఎన్టీఆర్ భరోసా ఫంక్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఆనాడుప్రతిపక్షంలో చెప్పిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఒకటో తేదీనే పింఛన్లు లబ్ధిదారుల చేతికి అందిస్తున్నామని గురువా రెడ్డి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రతినెల 2700 కోట్లు పై చీలుకు వృద్ధులు వితంతువులు వికలాంగులు కిడ్నీ వ్యాధిగ్రస్తులు దీర్ఘకాలం మంచానికే పరిమితమైన వారి కోసం ఖర్చు చేస్తూ అటు అధికారంలోకి వచ్చి 26 నెలల కాలంలో ఒక్క పెన్షన్ల కి 70 వేల కోట్లను ఖర్చుపెట్టినటువంటి సంక్షేమ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనే విషయాన్ని ఈరోజు ప్రజలందరికీ తెలియపరుస్తున్నామని గురవారెడ్డి అన్నారు . మంగళవారంరోజు అన్ని స్థాయిల్లో ఉన్నటువంటి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పేదల సేవలో సేవకులుగా పని చేస్తున్నటువంటి ముఖ్యమంత్రివర్యులు అనే విషయం ప్రజలందరికీ తెలియపరుస్తున్నామని చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురవారెడ్డి , క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్ప నాథ్ మైనారిటీ నాయకులు నవాబ్ ,మస్తాన్ కృష్ణారెడ్డి, కోదండ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అధికారులు చూస్తున్నారు.. మట్టి మాఫియా తవ్వుతోంది!

### "అడ్డుకుంటున్నాం" అంటున్న ఇరిగేషన్ శాఖ.. అయినా ఆగని పాడిపేట చెరువు తవ్వకాలు

### పది గ్రామాల సాగునీటికి ముప్పు పొంచి ఉన్నా.. అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

పాడిపేట చెరువులో మట్టి తవ్వకాలు ఆగడం లేదు.. అధికారులు మాత్రం "చూస్తున్నాం.. అడ్డుకుంటున్నాం.. చర్యలు తీసుకుంటాం" అంటూ చెబుతున్నారు. అధికారుల మాటలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది గ్రామాలకు పైగా సాగునీటిని అందిస్తూ వేలాది ఎకరాల పంటలకు ఆధారంగా ఉన్న పాడిపేట చెరువులో యంత్రాలతో భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కొనసాగుతున్నా.. సంబంధిత శాఖలు మాత్రం కఠిన చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 అడుగుల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయని, భారీగా మట్టిని బయటకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు స్వరూపం మారుతున్నా, యంత్రాలు తిరుగుతున్నా, మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు కేవలం పరిశీలనకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**మాటల్లో అడ్డుకుంటున్నారు.. చేతల్లో ఆపలేకపోతున్నారా?**

ఈ అంశంపై ఇరిగేషన్ శాఖ అధికారులను వివరణ కోరగా.. "మేము ఈ విషయాన్ని పరిశీలిస్తున్నాం. చెరువులో మట్టి తవ్వకాలు





జరగకుండా మా వంతుగా అడ్డుకుంటున్నాం. అయినప్పటికీ ఎవరో ఒకరు ఏదో విధంగా వెళ్లి తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. చెరువు పరిరక్షణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. అయితే అధికారులు అడ్డుకుంటున్నామని చెబుతున్నప్పటికీ.. తవ్వకాలు మాత్రం ఎందుకు ఆగడం లేదు? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అధికారులు నిజంగా అడ్డుకుంటున్నారా? అడ్డుకుంటే మళ్లీ మళ్లీ యంత్రాలు చెరువులోకి ఎలా వస్తున్నాయి? తవ్విన మట్టి ఎలా బయటకు తరలిపోతోంది? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అనుమతుల పేరుతో ఇంత దోపిడీకి అవకాశం ఉందా?**

మట్టి తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతులు ఉన్నాయని కొందరు చెబుతున్న నేపథ్యంలో.. ఆ అనుమతులు ఎవరి పేరుతో ఉన్నాయి? ఎంత పరిమాణంలో మట్టి తవ్వేందుకు అనుమతి ఇచ్చారు? ఎంత లోతు వరకు తవ్వుకోవచ్చు? ఏ ప్రాంతానికి అనుమతి ఉంది? ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలు అదే పరిధిలోనే ఉన్నాయా? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు ఉన్నప్పటికీ చెరువు భద్రతకు ముప్పు ఏర్పడేలా తవ్వకాలు జరుగుతున్నాయా అనే అంశాన్ని ఇరిగేషన్ శాఖ ఎందుకు పరిశీలించడంలేదని ప్రశ్నిస్తున్నారు.

పది గ్రామాల రైతుల భవిష్యత్తు ఎవరి బాధ్యత? పాడిపేట చెరువు నీటిపై ఆధారపడి పది గ్రామాలకు పైగా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. చెరువులో భారీగా గుంతలు ఏర్పడటం, తవ్వకాల వల్ల చెరువు స్వరూపం మారడం వల్ల భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యంపై ప్రభావం పడితే రైతుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.భారీ వర్షాలు కురిసి చెరువు నిండిన సమయంలో లోతైన గుంతలు, గట్లు, నీటి ప్రవాహ మార్గాల్లో మార్పుల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

**ఇకనైనా అధికారుల కళ్లు తెరవాలి!**

పాడిపేట చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఎంత మట్టి తవ్వారు? ఎంత పరిమాణంలో తరలించారు? ఎక్కడికి తరలించారు? ఎవరు అనుమతులు ఇచ్చారు? అనుమతుల పరిధికి మించి తవ్వకాలు జరిగాయా? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరుతున్నారు."చూస్తున్నాం.. అడ్డుకుంటున్నాం.. చర్యలు తీసుకుంటాం" అనే మాటలు ఇక వినాలని లేదు.. క్షేత్రస్థాయిలో తవ్వకాలు ఆగేలా చర్యలు కావాలి అని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.ప్రజల సాగునీటికి ఆధారమైన చెరువును కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని, మట్టి తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు మౌనం వహిస్తే అది మరిన్ని అనుమానాలకు తావిస్తుందని వారు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూసుకున్న ఫైళ్లను తెరిచి, క్షేత్రస్థాయిలో చర్యలకు దిగాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాలను నిలిపివేసి, అనుమతుల వాస్తవాలను బహిర్గతం చేయకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ ఎన్నారై నేత అన్నమేటి బాలసుబ్రమణ్యం

### - అమరావతిలో భేటీ.. పార్టీ బలోపేతం, ఎన్నారైల భాగస్వామ్యంపై చర్చ

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు గ్రామానికి చెందిన టీడీపీ ఎన్నారై జనరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత అన్నమేటి బాలసుబ్రమణ్యం మంగళవారం అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యంతో పాటు టీడీపీ ఎన్నారై కోర్ కమిటీ సభ్యులు కూడా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు మెరుగైన విద్యా అవకాశాలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.అలాగే రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు, ఎన్నారైలు మరింత క్రియాశీలకంగా భాగస్వాములు కావాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.





విదేశాల్లో స్థిరపడిన తెలుగువారిని రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలతో అనుసంధానం చేయడం, వారి నైపుణ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి ఉపయోగపడేలా ప్రోత్సహించడం వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిసింది.టీడీపీ ఎన్నారై విభాగం ద్వారా పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, విదేశాల్లో ఉన్న తెలుగువారిని పార్టీతో అనుసంధానం చేసే అంశాలపై కూడా నేతలు చర్చించినట్లు సమాచారం.ఈ సందర్భంగా నారా లోకేష్‌ను కలిసిన టీడీపీ ఎన్నారై నేతలు రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు.ముఖ్యంగా విద్యా రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించారు.అన్నమేటి బాలసుబ్రమణ్యం టీడీపీ ఎన్నారై విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.సాఫ్ట్‌వేర్ రంగంలో తన అనుభవంతో పాటు ఎన్నారై వర్గాలను పార్టీతో అనుసంధానం చేయడంలో కూడా ఆయన కృషి చేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో బాలసుబ్రమణ్యం, టీడీపీ ఎన్నారై కోర్ కమిటీ సభ్యులు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ భేటీ టీడీపీ ఎన్నారై విభాగంలో నూతన ఉత్సాహాన్ని నింపిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.


## స్విమ్స్ శ్రీపద్మావతీ మహిళా ఆసుపత్రిలో విజిలెన్స్ సిబ్బంది దురుసు?

### సమాచారం కోరిన రోగుల సహాయకులపై నిర్లక్ష్య వైఖరి..

### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటే 'నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో' అంటూ సమాధానం ఇచ్చారంటూ ఆరోపణలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలోని స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న విజిలెన్స్ సిబ్బంది రామకృష్ణపై రోగులు, వారి సహాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి నాలుగో అంతస్తులో విధుల్లో ఉన్న సమయంలో సమాచారం కోరిన రోగుల సహాయకుల పట్ల ఆయన దురుసుగా, నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రోగులకు సంబంధించిన విషయంపై సమాచారం తెలుసుకునేందుకు సహాయకులు విజిలెన్స్ సిబ్బందిని సంప్రదించగా, రామకృష్ణ ఫోన్‌లో మాట్లాడుకుంటూ వారికి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. పలుమార్లు సమాచారం కోరినప్పటికీ స్పందించకుండా, రోగుల సహాయకులతో అమర్యాదగా మాట్లాడారని వారు వాపోతున్నారు. అంతేకాకుండా తమకు ఎదురైన ఇబ్బందిపై పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని సహాయకులు చెప్పగా, 'నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో' అంటూ దబాయింపు ధోరణిలో సమాధానం ఇచ్చారని వారు ఆరోపించారు. దీంతో ఆసుపత్రి ఆవరణలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొని, రోగులు, వారి సహాయకులు ఆందోళనకు గురైనట్లు సమాచారం. టీటీడీకి చెందిన ప్రతిష్టాత్మక ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారితో పాటు వచ్చే సహాయకుల పట్ల కూడా సిబ్బంది మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. రోగులు ఇప్పటికే



అనారోగ్యం, ఆందోళనతో ఆసుపత్రికి వస్తారని, అలాంటి సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యంగా, దురుసుగా వ్యవహరించడం సరికాదని వారు మండిపడుతున్నారు. విధి సమయంలో ఫోన్‌లో కాలక్షేపం చేస్తూ, సమాచారం కోరిన వారికి స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వస్తున్న ఆరోపణలపై ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు. ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి, విధుల్లో అలసత్వం వహించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్ శ్రీపద్మావతీ మహిళా ఆసుపత్రికి మంచి పేరు ఉందని, కొందరు సిబ్బంది వ్యవహరించే తీరుతో ఆ ప్రతిష్టకు భంగం కలగకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

## శక్తి యాప్ డౌన్‌లోడ్లపై ప్రత్యేక దృష్టి

### మహిళల భద్రతకు సాంకేతికతను మరింత చేరువ చేస్తున్న చిత్తూరు జిల్లా పోలీసులు

### ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా విస్తృత అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయాన్ని త్వరగా పొందేందుకు ఉపయోగపడే శక్తి యాప్‌ను ప్రతి మహిళకు చేరువ చేసేందుకు చిత్తూరు జిల్లా పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో శక్తి యాప్ డౌన్‌లోడ్లను పెంచే దిశగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్ గురించి వివరించి, ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.మహిళలు ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు లేదా అత్యవసర సమయంలో పోలీసుల సహాయం కోరేందుకు శక్తి యాప్ ఉపయోగపడుతుంది. మహిళలు తమ భద్రత విషయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని,



సమస్య ఎదురైన వెంటనే పోలీసులను ఆశ్రయించాలని జిల్లా పోలీసులు సూచిస్తున్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా కళాశాలలు, వసతి గృహాలు, కార్యాలయాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా రిజిస్టర్ చేసుకోవాలి, అత్యవసర సమయంలో ఎలా వినియోగించాలి అనే అంశాలను మహిళలకు, విద్యార్థినులకు వివరిస్తున్నారు. అలాగే మహిళా పోలీసులు, శక్తి బృందాలు క్షేత్రస్థాయిలో మహిళలు, విద్యార్థినులతో మాట్లాడి శక్తి యాప్ ఉపయోగాలను వివరిస్తూ, ప్రతి మహిళ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి మహిళతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులైన మహిళలకు కూడా శక్తి యాప్ గురించి తెలియజేసి, వారితో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించేలా ప్రోత్సహించాలని జిల్లా పోలీసులు కోరుతున్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని మహిళలకు మరింత భద్రత, భరోసా కల్పించడమే చిత్తూరు జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం. ప్రతి మహిళ శక్తి యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన సమయంలో దాని సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసులు సూచించారు.

## లబ్ధిదారులకు అండగా ఎన్టీఆర్ భరోసా.. పింఛన్ల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



మండల కేంద్రమైన వాకాడులో మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి ప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో స్వయంగా పర్యవేక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్ వెంట ఏవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో పఠన నైపుణ్యాల పెంపే లక్ష్యం -- పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం

ప్రజా భూమి ప్రతినిధి:
– బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో గల ఎంపీఎఫ్ఎస్ ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ) పాఠశాలలను మంగళవారంమండల విద్యాశాఖాధికారి ఎ. మునిసుబ్రహ్మణ్యం ఆకస్మికంగా సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పఠన సామర్థ్యాలు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన ఎంఈవో విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి చదవగల సామర్థ్యాన్ని పరీక్షించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో విద్యార్థులు పాఠాలను చదివే విధానాన్ని గమనించి, పఠన నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి వయస్సుకు తగిన స్థాయిలో చదవగలిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎంపీపీఎస్ వేణుగోపాలపురం హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, బోధన కార్యక్రమాలు, పాఠ్యాంశాల పురోగతి, మౌలిక సదుపాయాల నిర్వహణపై కూడా ఎంఈవో ఆరా తీశారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థుల్లో పఠన, రచన, గణిత నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని కోరారు. ఈ తనిఖీలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# యువతలో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం: తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి

- ఘనంగా ప్రారంభమైన 'అమిగోస్ తిరుపతి ప్రీమియర్ లీగ్ సీజన్ 1'
- సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్‌లో పోటీలు
- టాస్ వేసి, బ్యాట్ పట్టి క్రికెట్ ఆడిన తుడా చైర్మన్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలోని ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ మైదానంలో సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ "అమిగోస్ తిరుపతి ప్రీమియర్ లీగ్ -- సీజన్ 1" ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్‌అఫిషియో మెంబర్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు యువతలో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో ఐక్యత, నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి అలవడతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను వెలికితీసేందుకు ఇటువంటి క్రీడా వేదికలు ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు క్రీడలను ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మైదానంలో స్వయంగా టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. అనంతరం పిచ్‌పై బ్యాట్ పట్టి క్రికెట్ ఆడుతూ కొన్ని చక్కటి షాట్లతో క్రీడాకారులను, ప్రేక్షకులను అలరించారు. తుడా చైర్మన్ స్వయంగా బ్యాటింగ్ చేస్తూ మైదానంలో సందడి చేయడంతో యువ క్రికెటర్లు, ప్రేక్షకులు కేరింతలతో ఉత్సాహం వ్యక్తం చేశారు.





టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహిస్తున్న ఆర్గనైజర్ కార్తీక్ మత్తయ్య, కో-ఆర్గనైజర్ వల్లభతో పాటు ఇతర సహాయ నిర్వాహకులను డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి అభినందించారు. టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, క్రీడాకారులు, యువత, నిర్వాహక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఘనంగా రక్తదాన శిబిరం

ప్రజా భూమి ప్రతినిధి
గూడూరు,



గూడూరు ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్, నెల్లూరు సహకారంతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాముఖ్యతపై విద్యార్థులు, సిబ్బందిలో అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ మేడమ్ శ్రీమతి అరవింద , రిజిస్ట్రార్ డా. ఎం. రాజయ్య , డిప్యూటీ రిజిస్ట్రార్ జె. రామయ్య పాల్గొని రక్తదాతలను ప్రోత్సహించారు. వారితో పాటు విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొంది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించింది. అలాగే శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రెడ్‌క్రాస్, నెల్లూరు ప్రతినిధులకు మరియు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో వారు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం ద్వారా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని యూనివర్సిటీ యాజమాన్యం తెలిపింది.

# ఎన్టీఆర్ భరోసా సామజిక భద్రత పెన్షన్ లు పంపిణీ చేసిన టిడిపి సీనియర్ నేత నేత బల్లి ముత్యాలయ్య

ప్రజాభూమి ప్రతినిధి(నాయుడుపేట)




నాయుడుపేట మండలంలోని పెరికలంపాటి కండ్రిగ గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకులు బల్లి ముత్యాలయ్య ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వ తాతల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం ప్రతినెల 1వ తారీకు ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో పెరికలింపాటి కండ్రిగ గ్రామంలో పెన్షన్ లు పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బల్లి రమేష్,కార్ణ సుధాకర్,దాసరి రాజా,సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ రెండేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నేలపల్లి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు మంగళవారం ఆయన గూడూరు మండలం నెల్లటూరు గ్రామంలో ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిందన్నారు అలాగే అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని అన్నారు చంద్రబాబు నాయుడు నిరంతర శ్రామికుడని ఆయన పట్టుదలతో ఏ పనిని సాధించిన దానిని విజయవంతం చేస్తారని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పలువురు వెళ్ళకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగువేల రూపాయలను వితంతు వృద్ధులకు పెన్షన్లను అందజేస్తుందని గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అంచెలంచలుగా పెంచి మూడు వేల రూపాయలను చేసిందని అందుకు భిన్నంగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3000 రూపాయలను ఒకేసారి నాలుగు వేల రూపాయలు పెంచి మూడునెలలకు కలిపి పింఛన్లను అందించిందని ఇది ఒక రికార్డుగా ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ ఎసుపోగు పెంచలయ్య, నెల్లటూరు సచివాలయ ఏఎన్ఎం శశిదేవి నల్లటూరు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ వాత్సల్య పాల్గొన్నారు.

# జనసైనికులచే భారీ రక్తదాన శిబిరం



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ముందస్తు వేడుకల్లో భాగంగా గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో జనసేన నాయకులు భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు మందస్తు వేడుకల్లా బంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు అభిమానులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు నాయకులు పెటేటి చంద్ర నిల్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కార్యకర్తలు అందరూ రక్తదానం చేశారని ప్రతి సంవత్సరం పుట్టినరోజు సందర్భంగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు బుధవారం పుట్టిన రోజు సందర్భంగా మరికొన్ని సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని రాష్ట్ర అభివృద్ధి జేయంగా పలాన సాగిస్తున్న పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, నయూం ,రాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయదుర్గా ఓపపీటల్లో సామూహిక సుమంగళి పూజలు



ప్రజా భూమి ప్రతినిధి,

గూడూరు పట్టణంలోని శ్రీ విజయ దుర్గ ఉప పీఠంలో శ్రావణ మంగళవారం సందర్భంగా దుర్గా అమ్మవారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి మహిళలచే సామూహిక సుమంగళి పూజ నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు

# రామచంద్రాపురం మండలంలో ఉద్రిక్తత

## భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

## - తహసీల్దార్‌ను అడ్డుకున్న బాధితులు

ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం



తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. అనుపల్లి పంచాయతీ పరిధిలోని ఉప్పిలివంక వద్ద సర్వే నంబర్ 316/1 భూమికి సంబంధించి ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. వివాదాస్పద స్థలంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అయితే తమ భూ సమస్యను పరిష్కరించకుండానే తహసీల్దార్ అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారని బాధిత రైతులు ఆరోపించారు. దీంతో తహసీల్దార్‌ను బాధితులు అడ్డుకుని తమ సమస్యను పరిష్కరించాలని నిలదీశారు. తహసీల్దార్ వాహనం ఎదుటే రైతులు నిరసనకు దిగారు. తమకు అన్యాయం జరుగుతోందని, తమ భూమికి సంబంధించిన సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూ వివాదంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ ఘటనతో ఉప్పిలివంక ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

# కీర్తిశేషులు కన్నవరం రామమ్మ జ్ఞాపకార్థం పోలేరమ్మ పొంగళ్లశాల నిర్మాణం

**ఈబీసీ కాలనీ వాసులకు అందుబాటులోకి సామూహిక సేవా భవనం**



ప్రజా భూమి ప్రతినిధి:– బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని ఈబీసీ కాలనీలో గల పోలేరమ్మ గుడి సమీపంలో బి.సి కాలనీ కు చెందిన కీర్తిశేషులు కన్నవరం రామమ్మ జ్ఞాపకార్థంగా కన్నవారం సుధాకర్ ఆచారి పొంగళ్లశాలను నిర్మించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి ఉత్సవాలు, పొంగళ్ల కార్యక్రమాలు, ఈ పొంగళ్లశాల ఉపయోగపడనుంది. గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు సౌకర్యవంతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ కీర్తిశేషులు కన్నవరం రామమ్మ గారి సేవలను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ పొంగళ్లశాల గ్రామానికి చిరస్మరణీయంగా నిలుస్తుందని పేర్కొన్నారు గ్రామాభివృద్ధికి తోడ్పడే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారుతదుపరి అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు పొంగళ్ళు పెట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుమారుడు సురేంద్ర కుటుంభం సభ్యులు గ్రామ పెద్దలు బీసీ కాలనీ వాసులు, మహిళలు, యువకులు భక్తులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం.. గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.



తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కుప్పారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు దాటిన అనంతరం ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. చెన్నై నుంచి నెల్లూరు వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుడిచేతిపె అనే టాటూ ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నాయుడుపేట పోలీసులను సంప్రదించి సమాచారం అందించాలని అధికారులు కోరారు. మృతుడి గుర్తింపు కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గ్రామాల అభివృద్ధి కూటమిపాలనలో నే -ఎమ్మెల్యే సునీల్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



2 ఏళ్ళ కూటమి పాలన అభివృద్ధి – సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా కేశవరం పంచాయతీ – రాఘవాపురం గ్రామం నందు డోర్ టూ డోర్ తిరుగుతూ కూటమి నాయకులతో కలసి కరపత్రం అందించి రెండేళ్లపాలన లో చేసిన అభివృద్ధి – సంక్షేమంను వివరిస్తున్న....డాక్టర్ శ్రీ పాశిం సునీల్ కుమార్ శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ. గత ప్రభుత్వంలో పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు.



25 లక్షలతో 4 సిసి రోడ్లు వేయించాం. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో వేసిన సీసీ రోడ్లు తప్ప ఒక్క రోడ్ వైసిపి ప్రభుత్వంలో వేయలేదు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీ లో 570 పెన్షన్లు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద 397 మందికి 1 కోటి 71 లక్షలు అందించాం. తల్లికి వందనం 543 మందికి విద్యార్థులకు 81 లక్షలు అందించాం. వెలుగు డిపార్ట్మెంట్ ద్వారా బ్యాంక్ లింకేజ్, వడ్డీలేని రుణాలు, ఉన్నతి తదితరవి 5 కోట్ల 39 లక్షల రూపాయలు అందించాం. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా 30 లక్షల పనులు చేసాం. ఆర్డబ్ల్యూఎస్ ద్వారా 5 లక్షల ఎా కాలనీ నందు బోర్ పైప్ లైన్ వేయించాం. సీఎం కింద 6 మందికి 3 లక్షల 28 వేల రూపాయలు అందించాం. జివిఆర్ సహకారంతో 55 లక్షలతో వాటర్ ప్లాంట్, పైప్ లైన్ దేవాలయాలు వంటివి కటించాం. ఈ రెండేళ్లలో పంచాయతీ నందు దాదాపుగా 8 కోట్ల 70 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి చేసాం అని అన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం..

**ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్:-**

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు,

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలం చీలాపల్లి గ్రామంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు,, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ .. స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్మును అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.నాలుగు వేలు పింఛను అందిస్తోందని, వారి నిత్య అవసరాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో రూ.7లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని, పౌష్టికాహారం అందించి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోల్ల హరి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్‌కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బా నాయుడు, కూటమి నాయకులు సీకే లావణ్య, కుమారి, ధన సింగ్, బాలసుబ్రమణ్యం యాదవ్, ప్రతాప్ నాయుడు, రాజేష్ కుమార్ రెడ్డి, బాలాజీ నాయుడు, దీపశ్రీ అనిల్, సుమతి, పీటర్, హేమాద్రినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

బుధవారం 02 సెప్టెంబరు 2026


## శ్రీ బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శించినతెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండ లంలో పర్యటించారు. సి.రామాపురం సమీపంలోని శ్రీ బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం సి.రామాపురం సమీపంలోని శ్రీ బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందర్శించారు. ఆశ్రమంలోని లక్ష్మీనారాయణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ బ్రహ్మశ్రీ గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఆశ్రమానికి చేరుకున్న గవర్నర్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

### డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై, ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక నిఘా.

### - 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.1,00,000 జరిమానా.



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై నిరంతరం చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, ఒక్కో కేసుకు రూ.10,000 చొప్పున రూ.1,00,000 జరిమానా విధించారు. అలాగే మరో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులో రూ.300 జరిమానా విధించడంతో మొత్తం రూ.1,00,300 జరిమానా విధించబడింది. వీటిలో ఒక కేసులో 7 రోజుల కమ్యూనిటీ సర్వీస్ విధించబడింది. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన మాత్రమే కాదని, అది వాహనం నడిపే వ్యక్తి ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే అమాయక ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టే చర్య అని అన్నారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని జీవితాంతం విషాదంలోకి నెట్టే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. "మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తుంది.. అదే విధంగా రోడ్డుపై ప్రయాణించే ప్రతి వ్యక్తి కూడా సురక్షితంగా ఇంటికి చేరాలి. మద్యం సేవించి వాహనం నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడండి" అని జిల్లా ఎస్పీ గారు ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి ప్రమాదకర ఉల్లంఘనలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి ఆలయానికి భక్తులు భారీ విరాళాలు



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు భారీ విరాళాన్ని సమర్పించారు. చంద్రగిరి మండలం తుంగరాంపల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం అమెరికాలో నివాసముంటున్న దామరపాటి చంద్రమౌళి, దామరపాటి లత దంపతులు ఆలయ అవసరాల కోసం 26 ఇత్తడి పాత్రలను బహూకరించారు. ఈ ఇత్తడి పాత్రల మొత్తం విలువ సుమారు రూ. 2.20 లక్షలు.తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఈ కానుకలను శ్రీ వంశీ స్వామి ద్వారా ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ నిత్యకైంకర్యాలు, సేవా కార్యక్రమాలకు ఉపయోగపడే సామగ్రిని అందించినందుకుగాను దాతల భక్తి, సేవాభావాన్ని ఆలయ అధికారులు అభినందించారు. దాతలకు, వారి కుటుంబ సభ్యులకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అధికారులు ఆకాంక్షించారు.

## పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట:-





ప్రజా భూమి ప్రతినిధి పూతలపట్టు,

పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో నేడు చిత్తూరులోని పూతలపట్టు శాసన సభ్యులు క్యాంప్ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి మరియు ూాజ చెక్కుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం కోరిన మొత్తం 39 మంది లబ్ధిదారులకు రూ. 43,01,290 విలువగల చెక్కులను ఎమ్మెల్యే గారు స్వయంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాలు: చెక్కులు: 35 మంది లబ్ధిదారులకు రూ. 25,44,790/-ూాజ చెక్కులు: 4 గురు లబ్ధిదారులకు రూ. 17,56,500/-ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తోంది. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోంది." అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

## ప్రమాద ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు, ముఖ్యంగా ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ చైర్మన్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ, ప్రమాదాల తీవ్రతను తగ్గించడం, జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి, ఐపిఎస్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, ప్రాణాంతక ప్రమాదాలను మరింత తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. 2025 జనవరి--ఆగస్టుతో పోలిస్తే 2026లో మొత్తం ప్రమాదాలు 462 నుంచి 425కు, 8% తగ్గగా, గాయపడిన వారి సంఖ్య 615 నుంచి 449కు, 27% తగ్గిందని తెలిపారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్ హెచ్-69, ఎన్ హెచ్-42, ఎన్ హెచ్ -140 మార్గాల్లో ప్రమాదాలకు కారణాలను గుర్తించి, బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్ పర్యవేక్షణ, వాహన తనిఖీలు, వేగ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయంతో రహదారి భద్రతా లోపాలను పరిష్కరించి, గోల్డెన్ అవర్‌లో ప్రమాద బాధితులకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధిక ప్రమాదాలు జరుగుతున్న జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి ఎన్‌హెచ్--69 (బెంగళూరు--పలమనేరు--చిత్తూరు--చెన్నై), ఎన్‌హెచ్--140 (చిత్తూరు--తిరుపతి), ఎన్‌హెచ్--42 (కుప్పం--పలమనేరు) మార్గాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను కలెక్టర్ సమీక్షించారు. ఆయా మార్గాల్లో ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేఆదేశించారు. జాతీయ రహదారులపై లైటింగ్, భద్రతా చర్యలు పటిష్టం చేయాలి. జిల్లాలోని జాతీయ రహదారులపై అవసరమైన ప్రాంతాల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. రహదారి పరిస్థితులు, సైన్‌బోర్డులు, హెచ్చరిక బోర్డులు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని జాతీయ రహదారులపై సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించినట్లు సమావేశంలో అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తనిఖీల్లో గుర్తించిన రహదారి భద్రతా లోపాలను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వాటి ప్రాధాన్యత, గడువుతో కూడిన సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత ప్రాజెక్ట్ డైరెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను సమీక్షించిన కలెక్టర్, ప్రతి ప్రమాదానికి దారితీసిన కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించాలని సూచించారు. ఒకే ప్రాంతంలో పదేపదే ప్రమాదాలు జరుగుతున్నట్లయితే ఆ ప్రాంతాన్ని గుర్తించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన ఇంజినీరింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పీఎం రాహత్ అమలుపై సమీక్ష

రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సహాయం అందించే పీఎం రాహత్ పథకం అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. ప్రమాద బాధితులకు సకాలంలో అవసరమైన అత్యవసర సహాయం అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించాలిరోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్‌లోనే వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 104/108 అత్యవసర సేవల పనితీరుపై అందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను సమీక్షించి, అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజల సూచనలపై స్పందించాలి.

రహదారి భద్రతకు సంబంధించి ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, సమస్యలు, సూచనలను పరిశీలించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లాలో రహదారి ప్రమాదాలను తగ్గించడం ప్రతి శాఖ బాధ్యతగా భావించి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సుబ్బరాజు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, నేషనల్ హైవే పిడి జి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి, ఈ శ్రీనివాసరావు, నేషనల్ హైవే అధికారులు బి చందు, కార్తిక రెడ్డి, రవీందర్ రావు, ఆర్ అండ్ బి సురేష్ బాబు, ఆర్టిసి అధికారి పంచాయతీరాజ్ శాఖ , డి సి హెచ్ ఓ పద్మాంజలి ,సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో తిరుపతిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలి

## ప్లాస్టిక్ నిషేధంతో పాటు ప్రత్యామ్నాయాల ప్రోత్సాహం- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్




ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

పారిశుధ్యం, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణలో తిరుపతి జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని మిని వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తో కలసి తిరుపతి జిల్లాలో పారిశుధ్యం, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ పై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ నాగేశ్వర రాజు, డి ఎఫ్ ఓ సాయి బాబా, జెడ్ పి సి ఈ ఓ రవి కుమార్ నాయుడు, తిరుపతి మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిపిఓ సుశీలా దేవి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎస్ ఈ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకర రావు, ఏ పి ఐ ఐ సి జెడ్ ఎం విజయ్ భారత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లు, టి టి డి అధికారులు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసి, దేశానికి ఆదర్శంగా నిలిచే నమూనాను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. కేవలం నిబంధనలు, ఆదేశాలతో కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు, ప్రజల్లో స్వయం క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, ప్రవర్తనా మార్పు తీసుకు రావడం కీలకమని స్పష్టం చేశారు. పాఠశాలలు, కుటుంబాల ద్వారా బాల్యం నుంచే పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని, ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై తనిఖీలు ముమ్మరం చేసి, ఉల్లంఘనలకు కఠిన జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అదే సమయంలో క్లాత్, జూట్, బయోడిగ్రేడబుల్ ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో వేస్ట్ ఎక్స్చేంజ్ సెంటర్ల ఏర్పాటును పరిశీలించి, అనధికారిక వ్యర్థ సేకరణదారులను వ్యవస్థీకృత విధానంలోకి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్మీ కంపోస్ట్‌ను విస్తరించి, దాని ద్వారా పారిశుధ్య కార్మికులకు అదనపు ఆదాయం కల్పించే విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. కళాశాలలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, హోటళ్లు, రిసార్టులు తదితర బల్క్ వేస్ట్ జనరేటర్లను పూర్తిగా గుర్తించి నమోదు చేయాలని, డ్రై వేస్ట్ సేకరణకు స్వచ్ఛ రథాలు, గ్రీన్ షాపుల వంటి వినూత్న నమూనాలను ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్, గాజు, కార్టన్, ఇనుము తదితర పునర్వినియోగ పదార్థాలను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ యూనిట్లకు తరలించే వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. లేఅవుట్లు, ఖాళీ స్థలాల్లో చెత్త డంపింగ్‌ను అరికట్టి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. లేఅవుట్ల అభివృద్ధిలో పచ్చదనం, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. తిరుపతి పవిత్ర నగరం కావడంతో ఇక్కడ అభివృద్ధి చేసే పారిశుధ్య, వ్యర్థాల నిర్వహణ నమూనాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా ఉండాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, డాక్యుమెంట్ చేసి, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలను పటిష్టంగా చేపడుతున్నామని, చెత్త తరలింపు, ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలను అమలు చేయడం జరుగుతుందని ఛైర్మన్ కు వివరించారు. స్వచ్ఛ భారత్ పై క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు తరచుగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన జరిమానాలు విధిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగులు, జూట్ బ్యాగు లు, ఆకులతో తయారు చేసిన ప్లేట్లు, బయోడిగ్రేడబుల్ కవర్ల వినియోగాన్ని ప్రోత్సాహిస్తున్నామన్నారు.

# రైతులకు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించకుండా పటిష్ట నిఘా

## ఎడగారు ధాన్యం సేకరణలో దళారుల జోక్యాన్ని అరికట్టాలి

## మార్కెట్ ధరలపై రోజువారీ నివేదికలు అందించాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి,లితిరుపతి,

రబీ 2025--26 (ఎడగారు) సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావుతో కలిసి ధాన్యం సేకరణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడగారు సీజన్‌లో వరి ధాన్యం కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించకుండా అన్ని శాఖలు సమన్వయంతో మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎడగారు సీజన్‌కు సంబంధించి సుమారు 1.11 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు సుమారు 1.04 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. ఎడగారు సీజన్‌లో సుమారు 32,400 హెక్టార్లలో 1,87,967 మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. సాధారణ పరిస్థితుల్లో మొత్తం ప్రాంతానికి సుమారు 2.26 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఉంటుందన్నారు. ఎడగారు సీజన్ కోతల సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం తరఫున ఎం.ఎస్.పి ఆధారిత ప్రత్యక్ష సేకరణ చేపట్టే పరిస్థితి లేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే రైతులకు కంటే తక్కువ ధర రాకుండా మార్కెట్‌లో ధరల స్థిరీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరి ధాన్యానికి సుమారు రూ.2,300 వరకు ధర లభిస్తోందని, ఇది ప్రస్తుత ఎం ఎస్ పి కంటే ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ కూడా అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ధర రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ధర తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎం.ఎస్.పి కంటే తక్కువ ధర లభించే పరిస్థితి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే దళారులు, వ్యాపారులు రైతులకు ఎం ఎస్ పి కంటే తక్కువ ధర చెల్లించకుండా మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాలు, తమిళనాడు తదితర ప్రాంతాలకు ధాన్యం తరలించే పరిస్థితులను కూడా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏ మండలంలోనైనా ధరలు తగ్గే పరిస్థితి లేదా రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం వస్తే ఆ మండలాన్ని ఫ్లాగ్ చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు అన్యాయం చేసే దళారులు లేదా వ్యాపారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని మండలాల వారీగా వరి ధాన్యం కొనుగోలు ధరలు, కోతల పురోగతి, మార్కెట్ డిమాండ్ తదితర అంశాలపై రోజువారీ నివేదికను తనకు పంపించాలని ఆదేశించారు. రైతులకు ప్రస్తుతం మార్కెట్ ధరలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, రానున్న రోజుల్లో పరిస్థితుల్లో మార్పులు వచ్చినా రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వరి సాగు సీజన్లపై అధికారులతో చర్చించారు. రబీ సీజన్‌కు కొనసాగింపుగా వేసే పంటను లేట్ రబీ (ఎడగారు) గా పరిగణిస్తారని అధికారులు కలెక్టర్ కు వివరించారు. సాధారణ ఖరీఫ్ వరి కోతలు సాధారణంగా అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతాయని, ఎడగారు పంట మాత్రం రబీ సీజన్ పరిధిలోకి వస్తుందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. తక్కువ వర్షపాతం కారణంగా భవిష్యత్తులో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉన్నందున మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలు, రైతులకు మెరుగైన ఆదాయం అందించే అవకాశాల పై కూడా దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన కొన్ని ప్రత్యేక వరి రకాలకు మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తున్న అంశాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇటువంటి మార్కెట్ ధోరణులను అధ్యయనం చేసి రైతులకు సరైన సమాచారం అందించాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం, మార్కెట్‌లో పారదర్శకమైన కొనుగోళు జరగడం, మీరా కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు జరగకుండా చూడడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి, సూళ్లూరుపేట ఆర్డిఓ లు రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్ రావు, మార్కెటింగ్ శాఖ ఏడి సురేంద్ర బాబు, డిటిసి మురళి మోహన్, డిఎస్ఓ రాజు, డిఎం సివిల్ సప్లయ్ దేవుల నాయక్, విజిలెన్స్ అధికారి, మిల్లర్ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు అవగాహన

**- పత్తి పంటలో చీడపీడల నివారణకు సూచనలు**

**- మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి**

ప్రజాభూమి, వేంపల్లె



పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగు, పంట రక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అలవలపాడు, ముత్తుకూరు గ్రామాల్లో రైతుల పొలాలను పరిశీలించి పంటల పరిస్థితి, దిగుబడి పెంపు, పంట రక్షణ చర్యలపై సూచనలు చేశారు. పత్తి పంటలో పచ్చదోమ, తెల్లదోమ, తామరపురుగు, పేనుబంక, మిరిడ్ బగ్ వంటి చీడపీడల లక్షణాలను గుర్తించాలని, వాటి నివారణకు వేప ఆధారిత మందులతో పాటు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన పురుగుమందులను వినియోగించాలని వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి సూచించారు. ప్రతి రైతు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను సాగు చేయాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని, ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం

**నిరుపేదలకు అదనపు ఆదాయం పెరగడానికి కావలసిన జీవనోపాదులు కల్పించడం:-**



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు,

గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ప్రత్యేక సమావేశ మందిరంలో జిల్లాలో ఐ=ణా (డిస్టిక్ రూరల్ డెవలప్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో జిల్లాలో అమలువుతున్న వివిధ సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లతో , కమ్యూనిటీ కోఆర్డినేటర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి పి డి శ్రీదేవి, ఎల్ డి ఎం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు అర్హులైన లబ్ధిదారులందరికీ సామాజిక భద్రతా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక ప్రణాళిక లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎస్సీ మరియు ఎస్టీ కుటుంబాల వారి ఆదాయం పెంపుదలకై జీవనోపాదుల ఏర్పాటుకు వివిధ రకాల పథకాల అమలపై వారికి అవగాహన కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని తెలిపారు. రుణం ఏ విధంగా తీసుకోవాలి, రుణం ఎన్ని వాయిదాలలో తిరిగి చెల్లించాలి పై వివరాలు అన్ని వారికి తెలియజేయాలని ఆదేశించారు.

# రేణిగుంట.. జడ్పీ బాలికల హైస్కూల్ వద్ద ప్రమాదం.. స్పృహ తప్పి కిందపడిన విద్యార్థిని

ప్రజా భూమిప్రతినిధి రేణిగుంట.



రేణిగుంటలోని జడ్పీ బాలికల హైస్కూల్ సమీపంలో మంగళవారం రోజు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బడికి వెళ్తున్న ఆరవ తరగతి విద్యార్థినిని అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బాధితురాలు రోజూ మాదిరిగానే పాఠశాలకు వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన పల్సర్ 125 సి సి బైక్ ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే స్పృహ కోల్పోయి పడిపోయింది.అపస్మారక స్థితిలో ఉన్న విద్యార్థినిని చూసి చుట్టుపక్కల వారు వెంటనే స్పందించారు. స్థానిక వాహనం సహాయంతో తక్షణమే ఆమెను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు.

ఉదయం వేళల్లో ట్రాఫిక్.... నిబంధనలు కరవు: ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గర్ల్స్ హైస్కూల్ పాఠశాల ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉండే ప్రాంతాలలో ఇలాంటి అతివేగపు వాహనాల దూకుడు పెరిగిపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ సమయాల్లో పోలీస్ సిబ్బందిని నియంత్రించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వేగానిరోధకాలు ఏర్పాటుచేసితగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# వినాయక నిమజ్జనానికి తుడా పరిధిలోని చెరువుల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**: తుడా ఛైర్మన్‌కు నిమజ్జన కమిటీ వినతి**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలకు తుడా పరిధిలోని ప్రధాన చెరువుల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినాయక చవితి నిమజ్జన కమిటీ ప్రతినిధులు తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తుడా కార్యాలయంలో ఛైర్మన్‌ను కలిసిన కమిటీ సభ్యులు, నిమజ్జనోత్సవాలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా సాగేందుకు తుడా తరఫున పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ,వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తుడా అధికారులతో సమీక్షించి అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినాయక చవితి నిమజ్జన కమిటీ ముఖ్య నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# చీనీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆర్డీఓకు రైతుల వినతి

ప్రజాభూమి, పులివెందుల



చీనీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లె గ్రామ రైతులు మంగళవారం ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఎకరాకు రూ.50 వేల నుంచి 60 వేలు పెట్టుబడి పెడితే, పులివెందుల మార్కెట్లో రూ.5 వేల నుంచి 10 వేల మధ్య మాత్రమే ధర పలుకుతోందని, పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ-నామ్ విధానంలో సరైన ఆన్‌లైన్ సిస్టమ్ లేకపోవడం వల్ల దళారుల దోపిడీకి గురవుతున్నామన్నారు.కోల్‌కతా, ఢిల్లీ మార్కెట్లలో ధరలు ఉన్నా తమకు గిట్టుబాటు కావడం లేదని, టన్నుకు కనీసం రూ.40 వేలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆర్డీఓకు తెలిపారు.దీనిపై స్పందించిన ఆర్డీఓ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలి - ఆర్డీఓ చిన్నయ్య



ప్రజాభూమి, పులివెందుల

ఓటర్లందరూ బీఎల్ఓలకు సహకరించాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య కోరారు.మంగళవారం ఆయన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైకాపా తరపున శివ, టీడీపీ తరపున నాగార్జున రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, పులివెందుల నియోజకవర్గంలో ఇంకా వెరిఫికేషన్ కాని ఓట్లు చాలా పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు తమ సచివాలయ పరిధిలోని బీఎల్ఓలను కలిసి అవసరమైన ఆధారాలు అందజేయాలని సూచించారు. ఈ నెలాఖరు నాటికి ఓట్ల నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు అర్హులని, ఆధార్ కార్డు, టెన్త్ మార్క్ లిస్ట్, రేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లాలని తెలిపారు.

# చలో కలెక్టరేట్ మరియు ఆర్డిఓ ఆఫీస్

**-ఏపీజెఏసి ఉద్యోగుల నిరసన**



ప్రజాభూమి ప్రతినిధి(నాయుడుపేట).

సీఎం సారు మా డబ్బులు మాకు ఇవ్వండి అంటూ మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ జెఏసి ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 11 వరకు నోటీసులు,నల్ల బ్యాడ్జీలు, లంచ్ అవర్ నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు జరుగుతాయి అన్నారు. సెప్టెంబర్ 1న సెల్ఫోన్ డిపి ల ద్వారా సీఎం సారు మా డబ్బులు మాకు ఇవ్వండి అనే నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండవ దశలో సెప్టెంబర్ 15 నుండి 26 వరకు వర్క్ టు రూల్, సోషల్ మీడియా ప్రచారం, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పిస్తారు. సెప్టెంబర్ 17న నల్ల కండవాలతో నిరసన, మానవహారం చేపడుతారు. సెప్టెంబర్ 23న కలెక్టరేట్ లు,ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 26న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో కలసి మా డబ్బులు మాకు ఇవ్వండి అనే నినాదంతో భారీ ధర్నా కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడడంతోపాటు పెండింగ్ డబ్బులు తక్షణం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే మూడవ దశలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏపీ జేఏసీ ఉద్యోగులు హెచ్చరించారు

# కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం మాత్రమే

**-: ఎమ్మెల్యే పులివర్తి నాని**

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి



రైతులకు ఖర్చు తగ్గించి.. ఉత్పాదక శక్తి పెంచేందుకు వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. రైతులకు వ్యవసాయ సాగు యంత్రాలను ట్రాక్టర్లు, ట్రాలీలు, మిల్లర్లు, గడ్డి కటింగ్ మిషన్లు సబ్సిడీపై రైతులకు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు సహాయ సహకారాలను కూటమి



ప్రభుత్వం అందిస్తుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో వ్యవసాయంతో పాటుగా చేపల పెంపకం ద్వారా కూడా రైతులు ఆదాయాన్ని సమకూర్చుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఎర్రవారిపాలెం మండలం: చిన్న సన్నకారు రైతులకు సబ్సిడీల ద్వారా ట్రాక్టర్లు, ట్రాలీలతో పాటుగా వ్యవసాయ ఆధారిత పనిముట్లు అందించి రైతు ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతుంది. రైతులు వ్యవసాయ రంగంతో పాటుగా చేపలను సాగు చేసి ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రోత్సహిస్తుంది. ఆసక్తి కలిగిన, అరులైన ప్రతి ఒక్క రైతు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# మాజీ సీఎం వైఎస్ జగన్ ను కలిసిన వైకాపా నాయకులు

ప్రజాభూమి, పులివెందుల



రెండు రోజుల పర్యటనలో భాగంగా పులివెందుల చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ జగన్ ను కలిశారు.ఈ సందర్భంగా జగన్ వారి యోగక్షేమాలను, పులివెందుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడవద్దు, అండగా నేనున్నానని భరోసా ఇచ్చారు.

# వెంకటాపురం జడ్పీహెచ్ఎస్‌లో "ది రైటింగ్ స్టార్ అవార్డు-2026" ప్రదానం

ప్రజాభూమి పోరుమామిళ్ల :



పోరుమామిళ్ల: మదర్ థెరెసా ఫౌండేషన్, పోరుమామిళ్ల వారి ఆధ్వర్యంలో వెంకటాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో "ది రైటింగ్ స్టార్ అవార్డు--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో అందమైన దస్తూరిని ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6, 7, 8, 10వ తరగతులకు ఒక్కొక్క విద్యార్థికి, 9వ తరగతికి ఇద్దరు విద్యార్థులకు కలిపి మొత్తం ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. అవార్డుతో పాటు సర్టిఫికెట్ మరియు మెమెంటో లను కూడా అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కో-చైర్మన్ చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, ట్రెజరర్ ప్రజ్వలారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రాజానంద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దస్తూరి ఎంతో ముఖ్యమని అన్నారు. చిన్నతనం నుంచే అక్షరాలను అందంగా, స్పష్టంగా రాయడం అలవాటు చేసుకుంటే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు భవిష్యత్తులో కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో దస్తూరి పట్ల ఆసక్తిని పెంపొందించి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై కూడా ఉందని పేర్కొన్నారు. ఈ ఆరుగురు విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు మెమెంటో అందించడం వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహంగా భావిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది విద్యార్థులు అందమైన దస్తూరితో ది రైటింగ్ స్టార్ అవార్డు ను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ అవార్డు కార్యక్రమం ద్వారా విద్యార్థులందరిలో ఆరోగ్యకరమైన పోటీ, సృజనాత్మకత మరియు రాతపట్ల ఆసక్తి పెరగాలని పిలుపునిచ్చారు. తమ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ది రైటింగ్ స్టార్ అవార్డు--2026 ను అందించిన మదర్ థెరెసా ఫౌండేషన్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత ఉపాధ్యాయులు జయరాం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# క్రెడిట్ చోరీ లో దేశంలోనే చంద్రబాబుకు మించిన నాయకుడు లేరు- పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



చంద్రబాబు నేనే శంకుస్థాపన చేశా .నేనే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నారంటూ ప్రచారం ఆర్భాటం తప్ప ఇంకేమీ లేదు అని .మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా 2004. అక్టోబర్ 27 తేదీన వెలుగొండకు శంకుస్థాపన చేసి నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 3582 కోట్ల వ్యయం చేసి సింహభాగం పూర్తిచేసిన ఘనత మహానేత. వైయస్ రాజశేఖర్ రెడ్డిది. వైయస్ జగన్మోహన్ రెడ్డి టైం లోనే దాదాపు 85% పూర్తి చేసిన ఘనత వైయస్సార్ కు. వైయస్ జగన్ కు దక్కుతుందని అన్నారు. 2019 నుండి 2024 వరకు కోవిడ్ సమయంలోనూ వెలుగొండ పనులను పరుగులెత్తించిన ఘనత వైఎస్ జగన్ ది. రికార్డు సమయంలో ఆసియాలోనే అత్యంత పొడవైన రెండు టర్నలను పూర్తి చేసిన ఘనత వైయస్ జగన్ . 72 25 వేల నిర్వాసిత కుటుంబాలకు 2024 జులై నాటికి .1.302-56 కోట్లతో పునరావాసానికి ప్రణాళిక చేయడం జరిగింది. తద్వారా 2024లో శ్రీశైలంలో నీటిమట్టం 841 అడుగులు చేరగానే సొరంగం ద్వారా నల్లమల సొరంగాల ద్వారా నల్లమల్ల సాగరకు నీటిని తరలించాలి నీ నిర్ణయించడం జరిగింది. కానీ 2024-2025 లో నల్లమల్ల సాగరకు నీటిని తరలించని చంద్రబాబు సర్కార్. నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించకుండా ద్రోహం. అన్యాయాన్ని కప్పిపుచ్చుకోవడానికి హార్టికల్చర్ హబ్ మార్కాపురం కు. చేస్తున్నట్లు మరో మోసపు మాట చెప్పారు. నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఎవరి టైం లో ఎంత ఖర్చు పెట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను మాట్లాడండి ఎల్లో మీడియా ఎల్లో పత్రికల ద్వారా లేనిపోనివి ప్రచారం చేయడం ప్రజలకు మోసం చేయడమే అని ప్రజలందరూ గమనిస్తున్నారని మీరు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రజల ఎదురు చూస్తున్నారని అన్నారు.

# పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్

ప్రజాభూమి పోరుమామిళ్ల :

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంను స్థానికంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్, 58వ బూత్ కన్వీనర్ చెన్ను వెంకట రమణ, ఆయకట్టు చైర్మన్ తోట వెంకటయ్య పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఆర్థికంగా ఎంతో భరోసానిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ప్రజాభూమి
జనరల్
బుధవారం, సెప్టెంబర్ 02, 2026


# ఫిట్‌నెస్‌తోనే సమర్థ పోలీసింగ్..

❖ క్రీడలను వృత్తి జీవితంలో భాగం చేసుకోవాలి.. ❖ గెలుపును వినయంగా.. ఓటమిని పట్టుదలతో స్వీకరించాలి.. ❖ మైదానం లోనూ పోలీసు శాఖ గౌరవం నిలబెట్టాలి: డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ❖ అట్టహాసంగా తొలి ఏపీ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం... ❖ బరిలో 1,900 మంది క్రీడాకారులు.. నాలుగు రోజుల పాటు పోటీలు...



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

శారీరక దృఢత్వం, మానసిక అప్రమత్తత పోలీసుల విధి నిర్వహణలో అత్యంత కీలకమని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. నిరంతరం సవాళ్లతో కూడిన విధులు నిర్వర్తించే పోలీసులు ఫిట్‌నెస్, క్రీడలను తమ వృత్తి జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కువ గంటలు పనిచేయడం, క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, ఒత్తిడిని తట్టుకోవడం, బృందంగా పనిచేయడం పోలీసు విధుల్లో భాగమని.. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కొనే శారీరక, మానసిక సామర్థ్యాన్ని క్రీడలు పెంపొందిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026ను మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ మైదానంలో మంగళవారం డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ప్రారంభించారు. శాంతి కపోతాలను, బెలూన్లను గాలిలోకి ఎగరవేసి రాష్ట్ర స్థాయి పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసు రేంజ్‌లు, యూనిట్ల నుంచి 1,900 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడుతున్నారు.

మరో 450 మంది అధికారు లు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, టీమ్ మేనేజర్లు, సహాయక సిబ్బంది ఇందులో భాగస్వాములు కానున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న 16 టీమ్ ల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూరాష్ట్రస్థాయిలో తొలిసారిగా ఇంత పెద్దఎత్తున పోలీసు క్రీడా పోటీలు నిర్వహించడం శాఖకు కీలక మైలురాయని పేర్కొన్నారు. "గెలుపును వినయంగా స్వీకరించండి.. ఓటమిని పట్టుదలకు పునాదిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు."ఈ సందర్భంలో మీరు క్రీడాకారులైనా.. అన్నింటికంటే ముందు పోలీసులని, మైదానంలోనూ, వెలుపలా మీ ప్రవర్తన పోలీసు శాఖ క్రమశిక్షణ, హుందాతనం, వృత్తి నైపుణ్యాన్ని ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో పోలీసు క్రీడాకారులు సాధించే విజయాలు పోలీసు బలగాలకు స్ఫూర్తినిస్తాయన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమిస్తూ క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. తొలి రాష్ట్రస్థాయి పోలీసు క్రీడా సమ్మేళనాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పోలీసు స్పోర్ట్స్ వింగ్, నిర్వాహక బృందాలను డీజీపీ అభినందించారు. పోటీలకు అవసరమైన వేదికలు, సౌకర్యాలు కల్పించిన రెండు విశ్వవిద్యాలయాల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు."ఆత్మ విశ్వాసంతో పోటీపడండి.. క్రమశిక్షణతో ఆడండి.. గెలుపును వినయంగా, ఓటమిని పట్టుదలతో స్వీకరించండి. అన్నింటికంటే మించి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ గౌరవాన్ని నిలబెట్టండి'' అంటూ క్రీడాకారులకు డీజీపీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ మీట్ ఫిట్‌నెస్, ప్రతిభ, క్రమశిక్షణ, సమిష్టితత్వం, క్రీడాస్ఫూర్తికి వేదికగా నిలిచి భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన క్రీడా సమ్మేళనాలకు బలమైన పునాది వేయాలని ఆకాంక్షించారు.నాలుగు రోజుల క్రీడా సంబరం సెప్టెంబరు 1 నుంచి 4 వరకు నాలుగు రోజుల పాటు ఈ క్రీడా సంబరం కొనసాగుతుంది.

వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానాలు పోటీలకు వేదికలు గా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ ఎన్. మధుసూదన్‌రెడ్డి, ఐజీలు ఆకే రవికృష్ణ, బి. రాజకుమారి, సిహెచ్. శ్రీకాంత్ కె.వి. మోహన్‌రావు, డీఐజీలు అన్బురాజన్,ఆర్.ఎన్. అమ్మిరెడ్డి, వకుల్ జిందాల్,పలువురు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మచిలీపట్నంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**కులమతాలకు అతీతంగా నిర్వహణ: ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజు**

**సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు ప్రత్యేక పూజలు, అన్నదానం, ఉట్టి కొట్టే పోటీలు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

జవ్వారుపేటలోని శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను కులమతాలకు అతీతంగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రతినిధులతో కలిసి శ్రీకృష్ణ భగవానుని చిత్రపటాలను చేతబట్టి, హరేకృష్ణ నామస్మరణ నడుమ వేడుకల వివరాలను మీడియాకు వెల్లడించారు. భక్తులందరూ విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఉత్సవాల వివరాలు & పోటీలు:ప్రత్యేక పూజలు: సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మందిరంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని విశిష్ట పూజలు నిర్వహిస్తారు.భక్తి కార్యక్రమాలు: కృష్ణాష్టమి రోజున కోలాటం, శ్రీకృష్ణ లీలామృత గానం మరియు మధ్యాహ్నం మహా అన్నదానం ఏర్పాటు చేశారు.ఉట్టి కొట్టే పోటీలు – నగదు బహుమతులుసందడి వాతావరణంలో యువత కోసం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు:ప్రథమ బహుమతి: ₹3,000/-ద్వితీయ బహుమతి: ₹2,000/-తృతీయ బహుమతి: ₹1,000/-ఈ విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు విజయ, జ్యోతి, సురేష్, రజిని, వాణి, ఈశ్వర్, చిన్నారి, భవాని, ధరణి, లక్ష్మి, జిలాని, ఫాతిమా, సైదాభీ తదితరులు పాల్గొన్నారు.

# తొట్టంబేడులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు. మణి

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొట్టంబేడు మండలం తొట్టం బేడు గ్రామం నందు శ్రీరామనగర్ కాలనీ లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం ఘ నంగా నిర్వహించారు.శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు, తెలు గుదేశంపార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు సూచనలతో లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో తంగేళ్లపాలెం సింగిల్ విండో బ్యాంక్ చైర్మన్ భీమల భాస్కర్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం (మణి),బూత్ ఇంచార్జ్ అయ్యప్ప, యూనిట్ కో-కన్వీనర్ భార్గవ కుమార్,చిన్నపై,పళని తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.పెన్షన్ అందుకున్న వృద్ధులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిపిఎం పార్టీ చొరవతో దీర్ఘకాలిక భూ సమస్యకు పరిష్కారం

ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

గత 20 సంవత్సరాలుగా రైతులను వెంటాడుతున్న భూ సమస్యకు సిపిఎం పార్టీ చొరవతో నేటికీ తెరపడిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగెరి పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడం పంచాయతీ , చుక్కల నిడిగల్లు రెవిన్యూ లో ఉన్న సర్వే నెంబర్లు 224/17,224/18,224/20 లో మూడు ఎకరాల 85 సెంట్లు భూమి ఎం. కృష్ణారెడ్డి ఆధీనంలో సాగు చేసుకునేవారు. ఈ భూమిని ఆయన ముగ్గురు కుమారులకు పంచేశారు.అయితే అప్పటినుండి అన్నదమ్ముల్లో బాగా పరిష్కారంలో మనస్పర్ధలు రావడంతో గత పది సంవత్సరాల నుంచి ఆ భూమిలో ఎటువంటి పంటలు పండించకుండా బీడుగా వదిలేశారు. ఈ అన్నదమ్ముల్లో ఒకరైన సుబ్రహ్మణ్యం రెడ్డి సిపిఎం పార్టీ నాయకులకు తమ సమస్యను తెలియజేయడంతో అప్పటి నుంచి నాయకులు ఆర్డీవోలకు ఎమ్మార్వోలకు సమస్యను తెలియజేసి ఈ సమస్యను పరిష్కరించాలని ఎంతో కృషి చేశారు. దీని ఫలితంగానే మంగళవారం మండల సర్వేయర్ మురళి సహాయంతో ఆ భూమిని క్షుణ్ణంగా సర్వే చేసి వారి వారి భూములకు హద్దులు నిర్ణయించడంతోపాటు రాళ్లు నాటి వారికి అప్పజెప్పడం జరిగింది. సిపిఎం పార్టీ నాయకుల చొరవతో ఇన్ని సంవత్సరాలు పంటలు పండించుకోవటానికి నిర్బంధంగా ఉన్న భూ సమస్యకు ముగింపు రావడంతో ఆ రైతుల కళ్ళల్లో ఆనందభాష్పాలు దొర్లాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ బాధ్యులు గంధం మణి, పార్టీ నాయకులు పెనగడం గురవయ్య, వెంకటేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**రేణిగుంట పట్టణంలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు పంపిణీ చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్**

**లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి**

ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు

పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిసరకులు డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఆనాడుప్రతిపక్షంలో చెప్పిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఒకటో తేదీనే పింఛన్లు లబ్ధిదారుల చేతికి అందిస్తున్నామని గురువా రెడ్డి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రతినెల 2700 కోట్లు పై చీలుకు వృద్ధులు వితంతువులు వికలాంగులు కిడ్నీ వ్యాధిగ్రస్తులు దీర్ఘకాలం మంచానికే పరిమితమైన వారి కోసం ఖర్చు చేస్తూ అటు అధికారంలోకి వచ్చి 26 నెలల కాలంలో ఒక్క పెన్షన్ల కి 70 వేల కోట్లను ఖర్చుపెట్టినటువంటి సంక్షేమ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనే విషయాన్ని ఈరోజు ప్రజలందరికీ తెలియపరుస్తున్నామని గురవారెడ్డి అన్నారు అదేవిధంగా దేశం లో ఎక్కడ లేని విధంగా సంక్షేమానికే అత్యధికంగా సంపద సృష్టించి ఖర్చు చేస్తున్నందుకు నిరసనమే ఈ యొక్క ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అనే విషయాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోవాలని కోరారు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తూ 90% సూపర్ సిక్స్ ను అమలు చేసినటువంటి ఘనత కూటి మీ ప్రభుత్వానిది నారా చంద్రబాబు నాయుడుది అన్నారు ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు నాయుడు నేరుగా లబ్ధిదారుల వద్దకే వెళ్లి ప్రతినెలా పింఛన్ అందుచేస్తున్నటువంటి విషయాన్ని తెలియపరుస్తూ ఈరోజు అన్ని స్థాయిల్లో ఉన్నటువంటి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పేదల సేవలో సేవకులుగా పని చేస్తున్నటువంటి ముఖ్యమంత్రివర్యులు అనే విషయం ప్రజలందరికీ తెలియపరుస్తున్నామని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురవారెడ్డి తో పాటు క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్ప నాథ్ పార్టీ నాయకులు నవాబ్ మస్తాన్ కృష్ణారెడ్డి కోదండ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

**కొనుగోళ్లు చేసిన వస్త్రాలకు ఎప్పటికప్పుడు సహకార సంఘాలకు చెల్లింపులు**




**రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు**
**మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు**
**రెండో ఏడాది కూడా పూర్తిస్థాయిలో చెల్లింపులు**
**రూ.కోటీ 3 లక్షల మేర లివరీ బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ**
**సత్ఫలితాలిస్తున్న మంత్రి సవిత సమీక్షలు**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 2019-24 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది.24 నెలల్లో రూ.24.51 కోట్ల చెల్లింపులుచేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.కోటీ 3 లక్షల లివరీ చెల్లింపులు మంత్రి సవిత ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖాధికారులు రాష్ట్రంలోని వివిధ చేనేత సహకార సంఘాలకు రూ.1,03,38,678లను మంగళవారం చెల్లించారు. వివిధ శాఖలు, గురుకులాల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి ఈ చెల్లింపులు చేశారు. 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆ చెల్లింపులను జమ చేశారు. త్వరలో మిగిలిన బకాయిలను కూడా చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. చెల్లింపులపై మంత్రి సవిత ప్రత్యేక దృష్టిసీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశంలో చేనేత సహకార సంఘాలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రత్యేక దృష్టి సారించారు. చేనేత సహకార సంఘాల ఆర్థిక బలోపేతంలో భాగంగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోళ్లు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేటి తరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఏయే వస్త్రాలు కావాలో ఆయా సంఘాలకు ఆప్కో ద్వారా ఆర్డర్లు అందజేస్తున్నారు. అదే సమయంలో ఆయా సంఘాల నేతలతోనూ సమావేశమై వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు తయారు చేయాలని సూచిస్తున్నారు. శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాకుండా వాటికి తక్షణ చెల్లింపులు చేసేలా ఆప్కో అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆప్కో చరిత్రలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత బకాయిల్లేకుండా మంత్రి సవిత తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రాంనగర్, షిర్డీ సాయి టెంపుల్ ప్రాంతంతో పాటు రుద్రంపేట గ్రామపంచాయతీ చంద్రబాబు నాయుడు కాలనీలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో అనంతపురం పార్ల మెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి పాల్గొన్నాము. ఈ సందర్భంగా వివిధ రకాల సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధి దా రులకు అందించాం. పేదలు, వృద్ధులు, వితంతు వులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా అందుతున్న పింఛన్ వారి జీవనానికి ఎంతో భరోసానిస్తోంది అన్నారు. ఆర్థికంగా అండగా నిలుస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో పింఛ న్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పేదల సంక్షేమం, ఆత్మ గౌరవం మరియు మెరుగైన జీవనం కోసం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృ త్వం లోని కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అనంతరం రుద్రంపేట గ్రామ పంచా యతీ లోని పీవీకేకే బంగ్లా సమీపంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGN-REGS) కింద రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి ప్రారంభించాము. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు, గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడతాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

## పదవి విరమణ ఉద్యోగాల తరాలకు మార్గదర్శకాలు.

ఎన్.ఎస్.ఆర్ కాలనీలో పదవి విరమణ సన్మాన కార్యక్రమం.
కోమండూరు శ్రీనివాస పుష్పనీ కంట్లాం రామ లక్ష్మణ్.



ప్రజా భూమి ప్రతినిధి-నాయుడుపేట

ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు విద్యపై ఉన్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంతో మంచి విద్యను అందించడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం కొమండూరు శ్రీనివాస పుష్ప పదవి విరమణ సందర్భంగా తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఎన్.ఎస్.ఆర్ కాలనీలోని ఎంపీపీ స్కూలు వద్ద సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా 1986 ఆగస్టు నుండి ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో కొనసాగి 2026 ఆగస్టు నెల 31వ తేదీన పదవి విరమణ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లను పంచిపెట్టడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగమణి, రామ్ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి తుడా పరిధిలోని చెరువుల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలి: నిమజ్జన కమిటీ వినతి



ప్రజా భూమి ప్రతినిధి-తిరుపతి

వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలకు తుడా పరిధిలోని ప్రధాన చెరువుల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినాయక చవితి నిమజ్జన కమిటీ ప్రతినిధులు తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్‌అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తుడా కార్యాలయంలో ఛైర్మన్‌ను కలిసిన కమిటీ సభ్యులు, నిమజ్జనోత్సవాలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తుడా తరపున పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తుడా అధికారులతో సమీక్షించి, అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక చవితి నిమజ్జన కమిటీ ముఖ్య నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

- కొనుగోళ్లు చేసిన వస్త్రాలకు ఎప్పటికప్పుడు సహకార సంఘాలకు చెల్లింపులు
- రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు
- మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు
- రెండో ఏడాది కూడా పూర్తిస్థాయిలో చెల్లింపులు
- రూ.కోటీ 3 లక్షల మేర లివరీ బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ
- సత్ఫలితాలిస్తున్న మంత్రి సవిత సమీక్షలు

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్లర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటకప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 2019-24 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కోనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబు నాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది.

**24 నెలల్లో రూ.24.51 కోట్ల చెల్లింపులు**

చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**రూ.కోటీ 3 లక్షల లివరీ చెల్లింపులు**

మంత్రి సవిత ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖాధికారులు రాష్ట్రంలోని వివిధ చేనేత సహకార సంఘాలకు రూ.1,03,38,678లను మంగళవారం చెల్లించారు. వివిధ శాఖలు, గురుకులాల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి ఈ చెల్లింపులు చేశారు. 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆ చెల్లింపులను జమ చేశారు. త్వరలో మిగిలిన బకాయిలను కూడా చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**చెల్లింపులపై మంత్రి సవిత ప్రత్యేక దృష్టి**

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశంలో చేనేత సహకార సంఘాలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రత్యేక దృష్టి సారించారు. చేనేత సహకార సంఘాల ఆర్థిక బలోపేతంలో భాగంగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోళ్లు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేటి తరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఏయే వస్త్రాలు కావాలో ఆయా సంఘాలకు ఆప్కో ద్వారా ఆర్డర్లు అందజేస్తున్నారు. అదే సమయంలో ఆయా సంఘాల నేతలతోనూ సమావేశమై వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు తయారు చేయాలని సూచిస్తున్నారు. శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాకుండా వాటికి తక్షణ చెల్లింపులు చేసేలా ఆప్కో అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆప్కో చరిత్రలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత బకాయిల్లేకుండా మంత్రి సవిత తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

# మాగుంట తన రాజకీయ సమాధిని తానే తవ్వుకున్నారు

- మేలు చేసిన జగన్ పై స్థాయి దిగజారి మాట్లాడటం కుసంస్కారనికి నిదర్శనం
- చంద్రబాబును సంతృప్తి పరచడానికి జగన్ పై విమర్శలా..?
- ఒంగోలు ప్రజలే మాగుంటకు బుద్ధి చెబుతారు
- వెలిగొండ ప్రాజెక్టు కట్టిందీ.. నీరు తెచ్చిందీ..వైఎస్సార్ కుటుంబమే
- కాదని మాగుంట తన భార్యా బిడ్డలపై ప్రమాణం చేయగలరా..?
- చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి-ప్రకాశం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై తప్పుడు వ్యాఖ్యలు చేసి మాగుంట శ్రీనివాసుల రెడ్డి తన రాజకీయ జీవితానికి తానే సమాధి తవ్వుకున్నారని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు చేయడం తప్పు కాదు కానీ, స్థాయికి దిగజారి మాట్లాడటం మాత్రం రాజకీయకు సంస్కారానికి నిదర్శనమని ఆక్షేపించారు. ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థిని విమర్శించడానికి కూడా ఒక హద్దు ఉంటుంది కానీ, ఆ హద్దును దాటితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డిని అవమానించేలా మాగుంట చేసిన వ్యాఖ్యలను ఒంగోలు ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, జగన్‌ను రాజకీయంగా విమర్శించడం వేరు, వ్యక్తిగతంగా అవమానించడం వేరు అని స్పష్టం చేశారు. మాగుంట శ్రీనివాసరెడ్డికి రాజకీయ జీవితాన్ని ఇచ్చిందీ, ప్రజల ముందుకు తీసుకెళ్లినది జగన్ మాత్రమేనని గుర్తు చేసారు. జగన్ పై చేసిన తప్పుడు వ్యాఖ్యలకు రేపు ఒంగోలు ప్రజలే మాగుంటకు రాజకీయంగా బుద్ధి చెబుతారని స్పష్టం చేసారు. మాగుంట శ్రీనివాసరెడ్డి ఇకనైనా సరే వ్యక్తిగత విమర్శలు మానుకుని ప్రజల సమస్యలు, ఒంగోలు అభివృద్ధి గురించి మాట్లాడాలని హితవు పలికారు.

2019లో జగనన్నను ప్రాధేయపడి ఎంపీగా గెలిచిన మాగుంట శ్రీనివాసుల రెడ్డి.. ఈరోజు అదే జగనన్నను 'వాడు', 'వీడు' అంటూ మాట్లాడే స్థాయికి దిగజారారు. కేవలం చంద్రబాబు నాయుడిని సంతృప్తి పరచడం కోసం తనకు రాజకీయంగా మేలు చేసిన నాయకుడినే అవమానించడం ఎంతవరకు సమంజసం? పలుమార్లు ఎంపీగా గెలిపించిన మాగుంట ప్రజలకు ఎంతమేరకు అందుబాటులో ఉన్నారో సమాధానం చెప్పాలి. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను గుర్తు చేసుకునే నాయకుడిగా మిగిలిపోయారు. ఎంపీగా తనకు అందిన నిధులను ప్రజా ప్రయోజనాల కోసం ఎంతవరకు ఖర్చు చేశారో మాగుంట ప్రజలకు వివరించాలి. ఎంపీ నిధులు ప్రజల సొమ్ము. ఆ నిధులను ఎంత ఖర్చు చేశారు? ఎక్కడ ఖర్చు చేశారు? ఒంగోలు ప్రజలకు ఎన్ని అభివృద్ధి పనులు చేశారు? ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్ని సమస్యలు పరిష్కరించారు? వీటికి ముందుగా సమాధానం చెప్పాలి. మాగుంట నిధులను ఏం చేసారో త్వరలోనే ప్రజల ముందు బయటపెటతాం. ఎంపీ పదవిని అడ్డుపెట్టుకుని వ్యాపార ప్రయోజనాలు పొందుతున్నరా లేదా..? ఎంపీ పదవిలో ఉండగా లిక్కర్ బిజినెస్ చేస్తూ సంపాదించిన ఆస్తులు, ఆదాయాలు, వ్యాపార ప్రయోజనాలు ఏమిటో ప్రజలకు చెప్పాలి. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి తన ఆర్థిక వ్యవహారాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి నీరు అందించేందుకు వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాలు చేసిన కృషిని మాగుంట కావాలనే విస్మరిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల కేటాయింపు, పనుల పూర్తి, నీటిని అందుబాటులోకి తీసుకురావడంలో వైఎస్ కుటుంబం పాత్ర లేదని మాగుంట భావిస్తే, నిజమని తన భార్యా బిడ్డలపై ప్రమాణం చేయాలి. వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి కార్యక్రమాలకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కొనసాగింపు ఇచ్చింది. పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి నీరు అందించేందుకు చేసిన కృషిని అక్కడి ప్రజలు మరిచిపోలేదు. చరిత్రను వక్రీకరించి మాట్లాడితే ప్రజలు నమ్మరు. తగిన సమయం చూసి తగిన బుద్ధి చెబుతారు.

## రామచంద్రపురం పట్టణం రాజబాబునగర్లో ఇంటింటికీ జనసేన.

భారీగా తరలివచ్చిన జనసేన పార్టీ శ్రేణులు.
కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రచారం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

రామచంద్రపురం పట్టణం ఏడో వార్డు నందు రాజబాబు నగర్ లో రానున్న మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో ఇంటింటా జనసేన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు,రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్నికల దృష్ట్యా నిర్వహించిన జనసేన పార్టీ ప్రచార కార్యక్రమంలో జనసైనికులు, వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కార మార్గాలను ప్రజలకు తెలియజేస్తూ, ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ విధానాలను వివరించడం జరిగింది. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా జనసేన శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆపార్టీ శ్రేణులు పేర్కొన్నారు. కార్యక్రమానికి భారీ స్థాయిలో వీర మహిళలు జనసేన శ్రేణులు తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు.

## పోచవరంలో ఉచిత వైద్య శిబిరం




ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం పోచవరం, రాగోలపల్లి, తుపాకులగూడెం గ్రామంలో తాళ్లపూడి శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రవి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 80 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్ల మురళి, మేనేజర్ చింటూ, పి. ఆర్. ఓస్. సాగర్, వెంకట్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముద్దాయికి రూ.10,500 జరిమానా, 7 రోజుల జైలు శిక్ష.

-నాయుడుపేట అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు.

ప్రజా భూమి ప్రతినిధి-నాయుడుపేట.



మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై నాయుడు పేట పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేకంగా నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దేశ మారయ్య (35)తండ్రి నరసింహులు,వృత్తి లారీ డ్రైవర్,మద్యం సేవించి లారీ నడుపుతుండగా పోలీసులు పట్టుకు న్నారు. అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి నాయుడుపేట కోర్టులో ఆధారపరిచి కేసును విచారించిన నాయుడుపేట జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శ్రీమతి పి.మీనాక్షి సుందరి ముద్దా యికి రూ.10,500 జరిమానాతో పాటు 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా నాయుడుపేట పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దనీ మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకునే విధంగా డ్రైవింగ్ చేయాలని నాయుడుపేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు వాహనాదారులకు తెలియజేయడం జరిగింది..

# ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు

- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పోలవరం ఎడమ కాలువ ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి
- ఎల్ఎంసీతో విశాఖకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రత
- రెండేళ్లలో ఎల్ఎంసీ పనులను పూర్తి చేశాం-మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ప్రజలు గత 20-30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించే మహత్తర కార్యక్రమం రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం ఎల్ఎంసీ పనుల్లో అనేక క్లిష్టమైన సమస్యలను అధిగమించి ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేసిందన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఏలేరు, పంపా, తాండవ, శారద, వరాహా వంటి ఐదు ప్రధాన నదులను దాటుకుంటూ కాలువను నిర్మించామని మంత్రి తెలిపారు. అదేవిధంగా 11 ప్రాంతాల్లో నేషనల్ హైవేలను క్రాస్ చేస్తూ పనులు పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవ వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న భూసేకరణ సమస్యను పరిష్కరించి, అత్యంత క్లిష్టమైన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల లోతు వరకు కొండను కట్ చేసి కాలువ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. వేలాది నిర్మాణాలు, భూసేకరణ సమస్యలు, ఇతర సాంకేతిక అవాంతరాలను అధిగమించి రెండేళ్లలోనే ఎల్ఎంసీ ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

**ఐదేళ్లలో ఎల్ఎంసీపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం**

2019-2024 మధ్య ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఒక్క తట్ట మట్టి పని కూడా జరగలేదని, ఒక్క రూపాయి పని కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే క్లిష్టమైన పనులను పూర్తి చేసి, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడం ప్రారంభించిందన్నారు.



**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎల్ఎంసీ జీవనాడి**

పోలవరం ఎల్ఎంసీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి జీవనాడిగా మారనుందని మంత్రి అన్నారు. ఎల్ఎంసీ ద్వారా విశాఖపట్నం నగరానికి తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు, భవిష్యత్‌లో రానున్న పరిశ్రమలకు అవసరమైన నీటి భద్రత కల్పించవచ్చన్నారు. నీరు, పరిశ్రమలు, పెట్టుబడులతో ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి శకం ప్రారంభం కానుందని తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, నేడు ఉత్తరాంధ్రకే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వచ్చే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

**పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా గోదావరి జలాలు**

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. అయితే పోలవరం పూర్తయ్యే వరకు ఉత్తరాంధ్ర ప్రజలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా ఎల్ఎంసీకి నీటిని అందిస్తున్నామని చెప్పారు. నాడు పురుషోత్తపట్నం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారు, అధికారంలోకి వస్తే పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి విమర్శించారు. అయితే నేడు అదే పురుషోత్తపట్నం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందుతున్నాయని తెలిపారు.

**పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణానికి రూ.29 కోట్లు**

పోలవరం ఎల్ఎంసీ పనుల్లో భాగంగా పుష్కర లిఫ్ట్‌కు సంబంధించిన పంపులను తొలగించాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రూ.29 కోట్లతో పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణ పనులు చేపట్టామని, పనులు పూర్తయితే అదనంగా 700 నుంచి 1,500 క్యూసెక్కుల వరకు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

**ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ప్రాధాన్యత**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రాబోయే రెండేళ్లలో ఆయా ప్రాజెక్టులపై రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీకి అవసరమైన అనుమతులను కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. రాబోయే 3-4 నెలల్లో నేరడి బ్యారేజీ పనులను పట్టాలెక్కించి ఉత్తరాంధ్ర చిరకాల కలను సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. వెనుకబడిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలను తరలించామని, ఇప్పుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కృష్ణా, గోదావరి జలాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా మళ్లిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార భగీరథుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఉత్తరాంధ్ర గుండెకాయ లాంటిదని, ఈ ప్రాంత అభివృద్ధికి నీరు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాల రాకతో సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

బుధవారం 2 సెప్టెంబరు 2026

## రామచంద్రపురం పట్టణంలో వైఎస్సార్ నగర్‌లో గడపగడపకు వైఎస్సార్ .



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రామచంద్రపురం టౌన్ 5వ వార్డ్‌లోని వైఎస్సార్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , వైఎస్సార్సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ గారు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలను అడిగి తెలుసుకున్న పిల్లి సూర్యప్రకాష్ గారు, ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ 5వ వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపిస్తే 5వ వార్డ్ అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 37వ రోజు విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'

### 97.32 లక్షల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం

### నేడు 1,52,172ఇళ్లను సందర్శించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చడం, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 37వ రోజు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 1,52,172 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 97.32 లక్షల ఇళ్లు సందర్శించబడ్డాయి. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా, ప్రజా భాగస్వామ్యంతో విస్తృతంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి ఘటనపై పవన్ కళ్యాణ్ విచారం

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

చిత్తూరు జిల్లా మంగళంపేట అటవీ ప్రాంత పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లె వద్ద ఓ మామిడి తోటలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మగ ఏనుగు మృతి చెందిన ఘటన పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ ఉన్నతాధికారుల ద్వారా తెలుసుకున్నారు. బోర్‌వెల్ మోటార్‌కు అనుసంధానించిన తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగ ఏనుగుకు తగలడం, ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో ప్రమాదం జరిగి ఉండవచ్చనేది ప్రాథమిక అంచనా అని అధికారులు తెలిపారు. ఏనుగు మృతి ఘటనపై విచారణ చేపట్టి, నివేదికను సమర్పించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. వన్యప్రాణి నిబంధనలు, నిర్దేశిత ప్రోటోకాల్ ప్రకారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఏనుగును ఖననం చేయాలని సూచించారు. వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తగినంత ఎత్తులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు.

## ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యం

- స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం
- ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం
- ఎస్ఐసిసిఐ 116వ వార్షిక సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ భారత చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 116వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో ఘనంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో చర్చలు జరిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థికసాయంతో ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఫీటా), ఎన్ఆర్ఐ వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఐసిసిఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ మాట్లాడుతూ 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని.. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర @2047' లక్ష్యాల సాధనలో చిన్న పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్ యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ, లయోలా ఇన్స్టిట్యూట్, త్యాగరాజ కాలేజ్, భారతిదాసన్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్. శివ శంకర్ ధన్యవాద సమర్పణతో ముగిసింది.

## విజయవాడ ఉత్సవ్ ,సరస్ నిర్వహణ ప్రాంతాన్ని పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు

### దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్‌లో వైభవంగా విజయవాడ ఉత్సవ్, సరస్..

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

విజయవాడ(పున్నమి ఘాట్)దేవి శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న "విజయవాడ ఉత్సవ్ & సరస్" కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, , నగర మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్,, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఎంపీ కేశినేని చిన్ని పున్నమి ఘాట్‌లో కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, దేవి శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడ నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించడంతో పాటు, గ్రామీణ కళాకారులు, చేతివృత్తిదారులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే అవకాశం కల్పించడమే విజయవాడ ఉత్సవ్ & సరస్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సరస్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల కళాకారులు, చేతివృత్తిదారులు, డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల హస్తకళలు, చేతివృత్తి ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, సంప్రదాయ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తుందని చెప్పారు. స్థానిక కళాకారులు, మహిళా సంఘాలను ప్రోత్సహించడం ద్వారా వారి కుటుంబాలకు అదనపు ఆదాయం లభించడంతో పాటు, మన సంప్రదాయ కళలు, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు దాదాపుగా 19 ఎకరాల ప్రాంతంలో1000స్టాల్స్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేయనున్నారు. పున్నమి ఘాట్ వంటి ఆహ్లాదకరమైన ప్రదేశంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున నగర ప్రజలు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఎంపీ కేశినేని చిన్ని కోరారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను కోరారు. విజయవాడ ఉత్సవ్ సరస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ప్రజలకు మంచి అనుభూతిని కలిగించేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విజయవాడ నగర ప్రజలకు వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామీణ కళాకారులు, డ్వాక్రా మహిళా సంఘాలకు తమ ప్రతిభను, ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఒక మంచి వేదిక లభిస్తుందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం వచ్చాకే.... అభివృద్ధి జరుగుతుంది

- ఎంపీ కేశినేని చిన్ని
- మ్యానిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తున్నాం
- త్వరలో 40 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోండా ఉమా తో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ చిన్ని

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 24వ డివిజన్లో స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమా తో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీ చిన్ని పాల్గొన్నారు. అనంతరం పెన్షన్లు వృద్ధులకు అందించి వారికి ఉన్న సమస్యలను ఎమ్మెల్యేతో కలిసి ఎంపీ చిన్ని తెలుసుకున్నారు. ఎంపీ ఎమ్మెల్యే నేరుగా వచ్చి పెన్షన్ అందించడంతో వృద్ధులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గత ప్రభుత్వం పెన్షన్ పెంపు చేయడానికి ఐదేళ్లు పట్టిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ పెంపు హామీని అమలు చేసిందని పేర్కొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్లో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు మరో కీలక హామీ అమలు దిశగా అడుగులు పడుతున్నాయని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 40 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుందని వెల్లడించారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని చిన్ని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ఇజ్జాడ దుర్గారావు, సెక్రటరీ గుడేటి మురళి, దామర్ల రామ్మూర్తి, రామకృష్ణ, గాజుల (బదర్), మాత్రపు బెనర్జీ, దుర్గా మౌనిక, సునీత మరియు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మూడు దశాబ్దాల కల నిజం చేసిన అపర భగీరథుడు చంద్రన్న

- వెలిగొండలో వైఎస్ జగన్ పాత్ర నామమాత్రం.. క్రెడిట్ చోరీ అంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో వెలిగొండకు ఖర్చు చేసింది కేవలం ?850 కోట్లు మాత్రమే
- పనులు పూర్తికాకుండానే 2024 ఫిబ్రవరిలో జగన్ హడావుడిగా ప్రాజెక్టును ప్రారంభించారు
- వైఎస్సార్ ఆశయాలను తుంగలో తొక్కిన జగన్.. ఇప్పుడు తండ్రి పేరుతో రాజకీయాలు చేస్తున్నారు
- ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

పశ్చిమ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు సాకారమవుతుంటే చూసి ఓర్వలేక వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు, దర్శి, ఆత్మకూరు, ఉదయగిరి వంటి కరవు ప్రాంతాల ప్రజలు ఐదారు దశాబ్దాలుగా సాగు, తాగునీటి కోసం ఎదురుచూశారు. కనీస వర్షపాతం కూడా లేని ఈ ప్రాంతానికి శ్రీశైలం నుంచి జలాలు తరలించేందుకు నాడు ఎన్టీఆర్ 1984లో కమిటీ వేసి, సుమారు ?684 కోట్ల అంచనా వ్యయంతో తొలి జీవో ఇచ్చి పునాది వేశారు. ఆ తర్వాత నేదురుమల్లి జనార్దనరెడ్డి గారు, కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు కూడా వీటికి సంబంధించి కొంత కదలిక అనేది ఈ ప్రాజెక్టు పైన జరిగింది. మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత 1996 మార్చి 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, కేంద్ర పర్యావరణ-అటవీ శాఖల నుంచి అత్యంత కీలకమైన అనుమతులు సాధించి, నల్లమల కొండలను తొలిచి సొరంగాల పనులను ముందుకు నడిపించారు. వెలిగొండ ప్రాజెక్టు ఆలోచన, రూపకల్పన, అమలులో జగన్ పాత్ర 'కంటికి కనిపించని నల్లపూస' వంటిది. ప్రాజెక్టు పూర్తయి ప్రజల కష్టాలు తీరుతుంటే, ఆ ప్రాంతంలో తన రాజకీయ పబ్బం గడవదనే ఆక్రోశంతోనే ఆయన 'క్రెడిట్ చోరీ' అంటూ శవరాజకీయాలు చేస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితోనే వెలిగొండ సాకారమైందని, ఇకనైనా జగన్ అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

వెలిగొండ ప్రాజెక్టును నాశనం చేసి.. సిగ్గులేకుండా జాతికి అంకితమంటూ ప్రగల్భాలు పలికిన జగన్ వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా ముందుకు తీసుకెళ్లింది తెలుగుదేశం ప్రభుత్వమైతే, గత ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించి కేవలం ఎన్నికల కోసం హడావుడిగా జాతికి అంకితం పేరిట జగన్మోహన్ రెడ్డి పెద్ద నాటకమాడారని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి నీటిపారుదల శాఖ మంత్రులు స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, తుమ్మల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో వెలిగొండ పనులకు అవసరమైన ప్రారంభ కార్యక్రమాలు శరవేగంగా జరిగాయి. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆ తర్వాత కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిలు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. 2009 తర్వాత నాటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో టన్నెల్-2 శంకుస్థాపన కార్యక్రమం జరిగి, పనులు కొంతవరకు పురోగతి సాధించాయి. ఈ విధంగా గతంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు తమ వంతు బాధ్యతగా పనులు చేపడితే, ఆ చరిత్రను మరిచి నేడు ప్రాజెక్టుపై జగన్మోహన్ రెడ్డి అండ్ టీం క్రెడిట్ రాజకీయాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. 2014 విభజన చట్టంలో విభజన గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరిలతో పాటు వెలిగొండ ప్రాజెక్టును నోటిఫై చేయించి ప్రాధాన్యత కల్పించారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 550 అడుగులు దాటిన తర్వాత కొల్లం వాగు నుంచి నీరు టన్నెల్స్‌లోకి చేరేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేశారు. చంద్రబాబు హయాంలోనే టన్నెల్-1 లో ఏకంగా 17.8 కిలోమీటర్లు, టన్నెల్-2 లో 11.2 కిలోమీటర్ల మేర సొరంగ తవ్వకం పనులను పూర్తి చేశారు. ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టుకు ఖర్చు చేసింది కేవలం ?850 కోట్లు మాత్రమే. ఏడాదిలో పూర్తయింది అరకిలోమీటరు లోపు బెంచింగ్ వర్క్, కేవలం 406 మీటర్ల లైనింగ్ మాత్రమే. ఫీడర్ కెనాల్, గొట్టిపడియ కాలువలు, మెయిన్ కెనాల్, ఫీడర్ ఛానల్స్‌కు సంబంధించిన కాంక్రీట్ వాల్స్, బ్రిడ్జిలు, లైనింగ్ పనులను గాలికొదిలేశారు. కొల్లం వాగు వద్ద పేరుకుపోయిన 4 లక్షల టన్నుల (1.60 లక్షల క్యూబిక్ మీటర్ల) మట్టిని తొలగించలేదు, అక్కడ వేయాల్సిన 36,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను కనీసం ముట్టుకోలేదు. టన్నెల్ బోరింగ్ మిషన్ ఇరుక్కుపోయి కాంట్రాక్టరు కోర్టుకెళ్లినా పట్టించుకోకుండా, టన్నెల్-2 పూర్తికాకుండానే 2024 ఫిబ్రవరిలో కేవలం ఓ పైలాన్ నిర్మించి ప్రాజెక్ట్ పూర్తయిపోయిందంటూ జాతికి అంకితమిచ్చినట్లు పచ్చి మోసం చేశారు. 11 గ్రామాలు, 7,555 ముంపు కుటుంబాలకు ఆర్&ఆర్ ప్యాకేజీ, భూసేకరణ కోసం ?1400 కోట్లు అంచనా వ్యయమైతే ?1300 కోట్ల జీవో తెచ్చి, కనీసం ?100 కూడా బాధితుల చేతిలో పెట్టని ఘోరమైన మోసానికి పాల్పడ్డారు. ప్రాజెక్టు పనులను పూర్తిగా తొక్కిపెట్టి, నిర్వాసితులను నిలువునా ముంచిన జగన్మోహన్ రెడ్డికి నేడు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. తండ్రి ఆశయాలను బజారుకీడ్చిన జగన్‌కు వైఎస్సార్ వారసత్వం చెప్పుకునే అర్హత లేదు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 45 రోజుల్లోనే వెలిగొండ నిర్వాసితులకు పరిహారం అందించి ప్రాజెక్టును పట్టాలెక్కించిందని, ఇది చూసి ఓర్వలేకే వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనది కాని క్రెడిట్ కోసం అర్రులు చాస్తున్నారని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఘాటుగా విమర్శించారు. గత ప్రభుత్వం పైసా ఇవ్వకుండా గాలికొదిలేసిన నిర్వాసితులకు, కూటమి ప్రభుత్వం వచ్చిన 45 రోజుల్లోనే మూడు విడతలుగా సుమారు 903 కోట్ల ప్యాకేజీని నేరుగా అందించింది. తమ ఊరు, ఇల్లు, బడి, గుడిని త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శిరస్సు వంచి నమస్కరించి గౌరవించారు. ఫీడర్ కాలువ నుంచి నల్లమల సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తుంటే 60-70 వేల మంది రైతులు, మహిళలు నీటిని ముద్దాడి ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. 30 మండలాల్లోని దాదాపు 30 లక్షల మందికి తాగునీరు, 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా మార్గం సుగమమైంది. ప్రాజెక్టు పోరాటయోధుడు పూల సుబ్బయ్య కృషిని గౌరవిస్తూ ప్రాజెక్టుకు ఆయన పేరును నిలపడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులను వేదికపై సగౌరవంగా సత్కరించారు. 61 ఆవుల మందలో తనదంటూ చెప్పుకునే 'కుంటి ఆవు' కథలా ఉంది జగన్ తీరు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన పాత్ర కంటికి కనిపించని నల్లపూస లాంటిది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీని 'తల్లి లాంటి వారు' అని నిండు మనసుతో గౌరవిస్తే.. అధికారం కోసం అదే సోనియా గాంధీని 'దయ్యం' అంటూ అత్యంత నీచంగా దూషించిన చరిత్ర జగన్‌ది. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్నది తన జీవితాశయమని స్వయంగా వైఎస్సార్ ప్రకటిస్తే.. అదే రాహుల్ గాంధీని 'పప్పు సుద్ద, ఆవాల ముద్ద' అంటూ బహిరంగంగా హేళన చేసి తన తండ్రి ఆశయాలను నిలువునా తొక్కి పాతేసింది జగన్మోహన్ రెడ్డి కాదా? తండ్రి సిద్ధాంతాలకు, ఆశయాలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సొంత కుంపటి పెట్టుకున్న జగన్‌కు.. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన పనుల పైన గానీ, వైఎస్సార్ క్రెడిట్‌పైన గానీ మాట్లాడే నైతిక అర్హత ఏమాత్రం లేదు. 30 ఏళ్లకే కాళ్లు చేతులు వంకర్లుపోయి, ఆకాశంలో వెళ్లే విమానాన్ని చూడాలన్నా మంచంపై పడుకోవాల్సిన దుస్థితి అనుభవించిన ఫ్లోరైడ్ బాధితుల ఆక్రంద వెలిగొండ. ఆ వేదనను ఏనాడూ పట్టించుకోని జగన్, ఇప్పుడు క్రెడిట్ చోరీ అంటూ నాటకాలు ఆడటం హాస్యాస్పదం. వెలిగొండ ప్రాజెక్టు ఆయనకి కేవలం మట్టి, కాలువలు మాత్రమే కావచ్చు కాని.. అది ఆ ప్రాంత ప్రజల జీవన్మరణ సమస్య అని, దానిని పరిష్కరించిన ఘనత ముమ్మాటికీ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అసంపూర్తి పనులతో జాతికి అంకితమంటూ పచ్చి మోసం.. శవరాజకీయాల 'క్రెడిట్' జగన్‌కు తప్ప ఎవరికీ సాధ్యం కాదువెలిగొండ ప్రాజెక్టును దారుణంగా నాశనం చేసి, అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరుపై మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కొల్లం వాగు అడ్డుగా ఉన్న మట్టి దిబ్బలు తీయకుండా, టన్నెల్ లైనింగ్ పూర్తి చేయకుండా, చుక్క నీరు కూడా చూడకుండా కేవలం ఎన్నికల కోసం 2024 ఫిబ్రవరిలో హడావుడిగా ప్రాజెక్టును ఎలా జాతికి అంకితం చేశారో జగన్ సమాధానం చెప్పాలి. నిర్వాసితులకు నయాపైసా ఇవ్వని జగన్ పాపాన్ని కడిగేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిహారం అందించింది.

